ఖమ్మం - భద్రాద్రి కొత్తగూడెం



వార్త

మంగళవారం 30, జూన్ 2026 16 పేజీలు

# తప్పుడు లెక్కలు...!!




- రికార్డులకెక్కని చెల్లింపులు...
- ప్రధాన సూత్రధారి సిపిఓ నే.?
- తాసిల్దార్ కార్యాలయాల వేదికగా గోల్మాల్
- వేతనాల కోసం కలెక్టర్ ను కలిసిన ఆపరేటర్లు
- డేటా ఎంట్రీ ఆపరేటర్లకు చెల్లింపులు మాయం..?
- పని చేసింది ఒకరైతే.. డబ్బులు తీసుకుంది మరోకరా..?
- ఐడీఓసీలో నిధుల గోల్‌మాల్‌పై ఆరోపణలు

2లో

కొత్తగూడెం కలెక్టరెట్ , జూన్ 29 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం 2024లో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేలో డేటా ఎంట్రీ పనులు చేసిన కంప్యూటర్ ఆపరేటర్లకు ఇప్పటివరకు పారితోషికం అందక పోవడం వివాదాస్పదంగా మారింది. జిల్లా ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాల మేరకు ఐడీఓసీలోని పలు శాఖల్లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లను డేటా ఎంట్రీ కోసం వినియోగించారు. ప్రభుత్వం ఒక్కో కుటుంబం వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసినందుకు రూ.30 చొప్పున చెల్లించాలని నిర్ణయించింది. అయితే ఐ డీ ఓ సీ ఆపరేటర్లు అశ్వరావుపేట, చంద్రుగొండ, కరకగూడెం, పాల్వంచ మండలాలకు సంబంధించిన డేటా ఎంట్రీ పనులను 2024 నవంబర్‌లో ఐడీఓసీ మీటింగ్ హాల్‌లో పూర్తిచేశారు.



2లో

# సీఎం సభ వాయిదా...

సభకు అడ్డంకిగా వర్షం.. నిరుత్సాహానికి గురైన కాంగ్రెస్ శ్రేణులు...
వర్షాల నేపథ్యంలో రైతు ఆశీర్వాద సభ వాయిదా : డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
రైతు భరోసా పంపిణీ అనంతరం ఘనంగా రైతు ఆశీర్వాద సభ నిర్వహిస్తాం
రైతు సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శం : వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

ఖమ్మం బ్యూరో, ప్రభాతవార్త : తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మధుర నియోజకవర్గంలో సీఎం రేవంత్ రెడ్డి నిర్వహించ తలపెట్టిన రైతు ఆశీర్వాద సభ భారీ వర్షాల కారణంగా వాయిదా పడింది. ఒకవైపు పది కార్ యంత్రాంగం పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తుండగా మరోవైపు రైతులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అభిమానులు లక్షలాదిమంది తరలి వచ్చేలా ప్రణాళికను రూపొందించారు. రెండు రోజులుగా 150 ఎకరాల సభ ప్రాంగణం మొత్తం అడుగు లోతు నీళ్లలో మునిగిపోయింది. వర్షాల కారణంగా రాష్ట్ర మంత్రులు సుమల నాగేశ్వరరావు లు సందర్శించి పరిస్థితిని సీఎం దృష్టికి తీసుకువెళ్లారు సభ నిర్వహణ ఇబ్బందిగా ఉంటుందని మంత్రులు ఇచ్చిన సమాచారంతో సీఎం సభను రద్దు చేసుకున్నారు అయితే యధావిధిగా 30వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు హైదరాబాదులోని శిల్పారామంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నట్లు మంత్రులు వెల్లడించారు.

# ఎమ్మెల్యే X చైర్ పర్సన్

ఇల్లందు లో గుప్పు మంటున్న రాజకీయ విభేధాలు
ఒకే పార్టీలో ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య పెరుగుతున్న దూరం..?
ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం లేకుండానే చైర్‌పర్సన్ హాజరు
పుర ఎన్నికల నాటి రాజకీయ ఒప్పందాలపై మళ్లీ చర్చ..!!
క్యాంపు కార్యాలయానికి దూరంగా చైర్‌పర్సన్, పట్టణ అధ్యక్షుడు
విభేదాలతో ఇరువర్గాల క్యాడర్‌లో అయోమయం
వర్గపోరుతో రానున్న స్థానిక ఎన్నికలపై ప్రభావం పడనుందా
ఎమ్మెల్యేతో విభేదం పట్టణ అభివృద్ధికి ఆటంకమేనా..?

2లో



ఇల్లందు, జూన్ 29, ప్రభాతవార్త: ఇల్లందు పట్టణ రాజకీయాల్లో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ మధ్య నెలకొన్న విభేదాలు ఇప్పుడు బహిరంగ చర్చకు దారితీస్తున్నాయి. కొంతకాలంగా ఇద్దరు నాయకు ల మధ్య సమన్వయం లోపించినట్లు కనిపిస్తుండగా, తాజాగా జరుగుతున్న పరిణామాలు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.



ఇరిగేషన్‌లో

# అవినీతి చేప

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఇరిగేషన్ ఎఈఈ



5లో



# సీఎం సభ వాయిదా...

మొదటిపేజీ తరువాయి

ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరణ దేవుడు కరుణించాడని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈనెల 30న చింతకాని మండలం జగన్నాథపురం లో నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభ సభా ప్రాంగణాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి డిప్యూటీ సీఎం సోమవారం పరిశీలించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మీడియాతో మాట్లాడాతూ వాతావరణ పరిస్థితులు, వర్షాల కారణంగా ఈ నెల 30న ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్, జగన్నాథపురం గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిధిగా హాజరవనున్న రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. రైతులు, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అన్నా రు. వారం రోజులుగా కురుస్తు న్న వర్షాలతో సభా ప్రాంగణం పూర్తిగా బురదమయంగా మారిందని, ప్రస్తుత పరిస్థితుల్లో లక్షలాది మంది రైతుల సమక్షంలో సభ నిర్వహించడం సాధ్యం కాదని తెలిపారు. రైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం రైతుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని సభను వాయిదా వేస్తోందని పేర్కొన్నారు. తొలుత ప్రారంభోత్సవ సభగా నిర్వహించాలని భావించిన ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు రైతు భరోసా పంపిణీ పూర్తయిన అనంతరం మరింత వైభవంగా ఖిరైతు ఆశీర్వాద సభఖి పేరుతో ముగింపు వేడుకగా నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. వాతావరణ శాఖ నివేదికల ప్రకారం జిల్లాలో జూలై 3 లేదా 4వ తేదీ వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని తెలిపారు. రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మరో వారం రోజుల వాతావరణ పరిస్థితులను సమీక్షించి, పరిస్థితులు అనుకూలిస్తే జూలై 6, 7 లేదా 8వ తేదీల్లో సభ నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా రైతులు, ప్రజలు ఈ సభపై విశేష ఆసక్తి చూపుతున్నారని, వాతావరణం అనుకూలించిన వెంటనే నిర్వహించే రైతు ఆశీర్వాద సభ ప్రజలు ఊహించని స్థాయిలో విజయవంతం అవుతుందని డిప్యూటీ సీఎం విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్షాల కారణంగా చింతకాని మండలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనాల్సిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేసినట్లు తెలిపారు. రైతుల భద్రత, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. వర్షం అడ్డొచ్చినా రైతు సంక్షేమం ఆగదని, రైతు భరోసా నిధుల విడుదలకు సీఎం సిద్ధంగా ఉన్నారని, మంగళవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా పథకం నిధులను విడుదల చేస్తారని మంత్రి వెల్లడించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ అంశాలపై ప్రతిపక్ష నాయకులు అర్థంపర్థం లేని విమర్శలు చేస్తున్నారని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో రైతు బంధు కింద రూ. 72 వేల కోట్లు అందించగా, ప్రజా ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్లలోనే రైతు భరోసా ద్వారా రూ. 36 వేల కోట్ల సాయం అందించిందని అన్నారు. యూరియా పంపిణీ కోసం రూపొందించిన యాప్ ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందుతూ ఉన్నాయని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. వానాకాలం సాగు ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రైతు భరోసా పథకం కింద కేవలం తొమ్మిది రోజుల్లోనే రూ.9 వేల కోట్లన్ను రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని పనిచేస్తోందని, ఈ పాలనలో తెలంగాణలో రైతు రాజ్యం సాకారమై దేశానికే మార్గదర్శకంగా నిలుస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాసాచారి, పీఆర్ ఎస్ఇ వెంకట్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, మహబూబాబాద్ జిల్లా వ్యవసాయ అధికారి విజయ చందర్, డిఆర్డీవో శ్రీరామ్, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# తప్పుడు లెక్కలు...!!

మొదటిపేజీ తరువాయి

అయితే, ప్రభుత్వం ఇందుకు సంబంధించిన నిధులు విడుదల చేసినప్పటికీ, పని చేసిన ఆపరేటర్ల ఖాతాల్లో ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా జమ కాలేదని వారు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై ఆపరేటర్లు జిల్లా జాయింట్ కలెక్టర్‌ను కలిసి పిర్యాదు చేయడంతో విషయం వెలుగులోకి వచ్చినట్లు సమాచారం. పని చేసిన వారికే కాకుండా మరొకరి ఖాతాల్లో నిధులు జమయ్యాయనే అనుమానాలను వారు వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత కార్యాలయ అధికారులను పలుమార్లు సంప్రదించినప్పటికీ స్పష్టమైన సమాధానం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు రావాల్సిన పారితోషికం ఎవరి ఖాతాల్లో జమ అయిందో వెల్లడించాలని, చెల్లింపులకు సంబంధించిన పూర్తి వివరాలను బహిర్గతం చేయాలని డేటా ఎంట్రీ ఆపరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. అధికారిక రికార్డుల్లో కూడా సరైన వివరాలు నమోదు చేయకుండా నిధులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై జిల్లా యంత్రాంగం సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, పని చేసిన ప్రతి డేటా ఎంట్రీ ఆపరేటర్‌కు రావాల్సిన పారితోషికాన్ని వెంటనే చెల్లించాలని బాధితులు కోరుతున్నారు. డేటా ఎంట్రీ చెల్లింపుల్లో గందరగోళం? ఎస్ఈఈఈపీసీ డేటా ఎంట్రీ చెల్లింపుల వ్యవహారంలో మరిన్ని ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి. ముఖ్యంగా ఐడాక్ (ఐడిఓసీ) సిబ్బందికి జరిగిన చెల్లింపులపై పారదర్శకత లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఆరోపణల ప్రకారం, ఐడాక్‌కు చెందిన 24 మంది సిబ్బంది పలు మండలాల డేటా ఎంట్రీ పనులు చేసినప్పటికీ, వారికి కేవలం అశ్వారావుపేట మండలానికి సంబంధించిన చెల్లింపులు మాత్రమే జరిగినట్లు చెబుతున్నారు. మిగిలిన మండలాల పనులకు సంబంధించిన పారితోషికం ఎందుకు ఇవ్వలేదనే ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. జిల్లా మొత్తం మీద ఎన్ని డేటా ఎంట్రీలు జరిగాయి? ఒక్కో ఎంట్రీకి ఏ రేటు ప్రకారం చెల్లింపులు చేశారు? అశ్వారావుపేట మండలానికి సంబంధించిన మొత్తాన్ని ఎవరి ఆదేశాలతో విడుదల చేశారు? మిగిలిన మండలాల బిల్లులు ఎందుకు పెండింగ్‌లో ఉంచారు? అనే అంశాలపై పూర్తి వివరాలు వెల్లడించాలని బాధితులు కోరుతున్నారు. అలాగే, ఒకే కార్యాలయంలో పనిచేసిన 24 మంది సిబ్బందికే పూర్తి చెల్లింపులు చేయనప్పుడు, జిల్లా వ్యాప్తంగా డేటా ఎంట్రీ చేసిన మిగతా సిబ్బందికి న్యాయం జరిగిందని ఎలా చెప్పగలరని ప్రశ్నిస్తున్నారు. చెల్లింపుల ప్రక్రియలో అవకతవకలు జరిగి ఉండొచ్చనే అనుమానాలను కూడా వ్యక్తం చేస్తున్నారు. రికార్డులకెక్కని చెల్లింపులు... అంతేకాకుండా, చెల్లింపులకు సంబంధించిన మొత్తాలను బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన మహిళా ఉద్యోగిని అనంతరం బదిలీ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆమె ఎవరెవరికి చెల్లింపులు చేశారు? ఏ ప్రాతిపదికన నిధులు విడుదలయ్యాయి? అనే అంశాలపై కూడా పూర్తి స్థాయి విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, ఇవన్నీ ప్రస్తుతం ఆరోపణలు మాత్రమే. ఈ అంశాలపై సంబంధిత అధికారులు లేదా ఆరోపణలు ఎదుర్కొంటున్న వారి నుంచి అధికారిక స్పందన వెలువడలేదు. ఆరోపణల నిజానిజాలు స్వతంత్ర విచారణ ద్వారానే తేలాల్సి ఉంది. డేటా ఎంట్రీ పనులకు సంబంధించిన చెల్లింపుల వ్యవహారంలో మరోసారి వివాదం చెలరేగింది. డేటా ఎంట్రీ చేసినప్పటికీ ఐడాక్ (ఐడిఓసి) సిబ్బందికి చెల్లింపులు జరగలేదని ఆరోపిస్తూ పలువురు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ప్రధాన సూత్రధారి సిపిఓ నే.? సీపీఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సదరు వ్యక్తి అందరి నుంచి డేటాను సేకరించినప్పటికీ, కొంతమంది చేసిన పనిని నమోదు చేయలేదని పేర్కొంటున్నారు. దీనివల్ల సంబంధిత సిబ్బందికి చెల్లింపులు నిలిచిపోయాయని ఆరోపిస్తున్నారు. అలాగే, ఐడాక్ సిబ్బంది డేటా ఎంట్రీ చేసినప్పటికీ వారికి పారితోషికం ఇవ్వకపోగా, మానిటరింగ్ సిబ్బందిని నియమించి వారికి మాత్రం చెల్లింపులు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు. మండలాల నుంచి తహశీల్దార్లు పంపిన వివరాల ఆధారంగా చెల్లింపులు చేశామని అధికారులు పేర్కొన్న నేపథ్యంలో, సంబంధిత వ్యక్తులకు డేటా ఎంట్రీ కోసం అధికారిక లాగిన్ ఐడీలు ఉన్నాయా? వారు నిజంగా పని చేశారా? అనే అంశాలను పరిశీలించిన తర్వాతే చెల్లింపులు చేశారా అనే ప్రశ్నలు కూడా లేవనెత్తుతున్నారు. అంతేకాకుండా సీపీఓ కార్యాలయంలోని కంప్యూటర్ ఆపరేటర్ సేకరించిన బ్యాంకు ఖాతాల వివరాలు, డేటా ఎంట్రీ వివరాలను ఏ ప్రయోజనం కోసం వినియోగించారనే అంశంపైనా వివరణ కోరుతున్నారు. ఇక చెల్లింపులు చేసిన అధికారిణిపై కూడా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆమె తనకు నచ్చిన వారికి మాత్రమే నిధులు విడుదల చేశారని, పలుమార్లు కలిసినా "మీకు డబ్బులు రావు" అంటూ బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో పూర్తి స్థాయి విచారణ జరిపి, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేస్తున్నారు.

# ఇల్లందు లో ఎమ్మెల్యే V/S చైర్ పర్సన్

గుప్పు మంటున్న రాజకీయ విబేధాలు

ఒకే పార్టీలో ఇద్దరు ప్రజాప్రతినిధుల మధ్య పెరుగుతున్న దూరం..?

ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం లేకుండానే చైర్‌పర్సన్ హాజరు

పుర ఎన్నికల నాటి రాజకీయ ఒప్పందాలపై మళ్లీ చర్చ..!!

క్యాంపు కార్యాలయానికి దూరంగా చైర్‌పర్సన్, పట్టణ అధ్యక్షుడు

విభేదాలతో ఇరువర్గాల క్యాడర్‌లో అయోమయం

వర్గపోరుతో రానున్న స్థానిక ఎన్నికలపై ప్రభావం పడనుందా

ఎమ్మెల్యేతో విభేదం పట్టణ అభివృద్ధికి ఆటంకమేనా..?

**ఇల్లందు, జూన్ 29, ప్రభాతవార్త:** ఇల్లందు పట్టణ రాజకీయాల్లో అధికార పార్టీకి చెందిన ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్‌పర్సన్ మధ్య నెలకొన్న విభేదాలు ఇప్పుడు బహిరంగ చర్చకు దారితీస్తున్నాయి. కొంతకాలంగా ఇద్దరు నాయకు ల మధ్య సమన్వయం లోపించినట్లు కనిపిస్తుండగా, తాజాగా జరుగుతున్న పరిణామాలు రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ప్రభుత్వ, మున్సిపల్ అభివృద్ధి కార్యక్రమాల్లో ఒకరికి ఒకరు దూరంగా ఉండడం, వేర్వేరుగా కార్యక్రమాల్లో పాల్గొనడం, ఇటీవల పలు ప్రారంభోత్సవాలను ఎమ్మెల్యే గైర్హాజరీలోనే చైర్‌పర్సన్ ప్రారంభించడం వంటి పరిణామాలు అధికార పార్టీలో అంతర్గత విభేదాలు మరింత ముదిరినట్లుగా సంకేతాలు ఇస్తున్నాయని రాజకీయ పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు.

## ప్రారంభోత్స వాల్లో ఎమ్మెల్యే గైర్హాజరు...

ఇటీవల పట్టణంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు చైర్‌పర్సన్ స్వయంగా హాజరై ప్రారంభోత్సవాలు నిర్వహించినప్పటికీ, సంబంధిత కార్యక్రమాల్లో స్థానిక ఎమ్మెల్యే కనిపించకపోవడం రాజకీయ చర్చకు కేంద్రబిందువైంది. సాధారణంగా ప్రభుత్వ నిధులతో చేపట్టే పనుల ప్రారంభోత్సవాలకు ఎమ్మెల్యే హాజరవడం ఆనవాయితీగా ఉండగా, వరుసగా జరిగిన కార్యక్రమాల్లో ఆయన లేకపోవడం వెనుక రాజకీయ కారణాలే ఉన్నాయా అనే చర్చ సాగుతోంది.

## క్యాంపు కార్యాలయానికి దూరంగా...

మరోవైపు గత కొంతకాలంగా మున్సిపల్ చైర్‌పర్సన్, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి దూరంగా ఉంటున్నారనే ప్రచారం కూడా జోరుగా వినిపిస్తోంది. పార్టీకి సంబంధించిన కార్యక్రమాలు, సమావేశాల్లో సైతం గతంలో కనిపించిన సమన్వయం ఇప్పుడు కనిపించడం లేదని పార్టీ శ్రేణులే చర్చించుకుంటున్నాయి. ఒకే పార్టీకి చెందిన కీలక నాయకులు వేర్వేరుగా వ్యవహరించడం కార్యకర్తల్లో అయోమయానికి దారితీస్తోందని అంటున్నారు.

## పుర ఎన్నికల ఒప్పందాలపై మళ్లీ చర్చ...

ఈ పరిణామాల నేపథ్యంలో పురపాలక ఎన్నికల సమయంలో కుదిరిన రాజకీయ అవగాహన, పదవుల పంపకాలపై ఉన్న ఒప్పందాలకు చైర్‌పర్సన్ చెక్ పెట్టారా అనే చర్చ కూడా మళ్లీ తెరపైకి వచ్చింది. మున్సిపల్ పాలనలో తీసుకుంటున్న నిర్ణయాలు, కార్యక్రమాల నిర్వహణలో స్వతంత్ర వైఖరిని చైర్‌పర్సన్ అవలంబిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## అధిపత్య పోరా...? ఆర్థిక వ్యవహారాల ప్రభావమా...?

ఈ విభేదాలకు అసలు కారణం ఏమిటన్న దానిపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు రాజకీయ ఆధిపత్య పోరేనని చెబుతుండగా, మరికొందరు మున్సిపల్ అభివృద్ధి పనులు, కాంట్రాక్టులు, ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన అంశాలే విభేదాలకు కారణమని ప్రచారం చేస్తున్నారు. అయితే ఈ ప్రచారాలపై అధికారికంగా ఎలాంటి నిర్ధారణ లేదు. సంబంధిత నాయకులు కూడా బహిరంగంగా స్పందించలేదు.

## కార్యకర్తల్లో అయోమయం...

ఇదిలా ఉండగా, ఎమ్మెల్యే-చైర్‌పర్సన్ మధ్య నెలకొన్న ఈ రాజకీయ దూరం భవిష్యత్తులో మున్సిపల్ పాలన, అభివృద్ధి పనులు, పార్టీ వ్యవహారాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న ఆసక్తి నెలకొంది. రానున్న రోజుల్లో ఇరువర్గాలు రాజీకి వస్తాయా? లేక ఈ కోల్డ్ వార్ మరింత ముదురుతుందా? అన్నది ఇప్పుడు ఇల్లందు రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## ఎమ్మెల్యేతో విభేదం పట్టణ అభివృద్ధికి ఆటంకమేనా..?

అన్ని ఉన్న ఆకు అనిగిమనిగి ఉంటే ఏమిలేని ఆకు ఎగిరెగిరి పడుతుంది అనే పెద్దల మాట కు సూట్ అయ్యే విధంగా ఇల్లందులో జరుగుతుందని పట్టణ ప్రజలు పేర్కొంటున్నారు. ఇల్లందు నియోజకవర్గానికి బాస్ అయినా ఎమ్మెల్యే కోరం కనకయ్యతో పట్టణ చైర్ పర్సన్ మధ్య జరుగుతున్న కోల్డ్ వార్ పట్టణ అభివృద్ధికి ఆటంకంగా మారే అవకాశం ఉందంటూ పట్టణ ప్రజలు మాట్లాడుకుంటున్నారు. ఏది ఏమైనా ఇరువురి మధ్య జరుగుతున్న ఈ కోల్డ్ వార్ వల్ల నష్టపోయేది పుర పాలకులే అంటూ ఎమ్మెల్యేకు వచ్చే నష్టం ఏమీ ఉండదని పుర మేధావులు పేర్కొంటుండడం గమనార్హం. చైర్ పర్సన్ వద్ద ఉన్న కొంతమంది గోడమీద పిల్లులు చైర్మన్ ను తప్పుదోవ పట్టిస్తున్నారని అందులో భాగంగానే ఇరువురి మధ్య భేదాభిప్రాయాలు చోటు చేసుకుంటున్నట్లు వార్తలు గుప్పు మంటున్నాయి.

## త్వరలోనే ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్, పిఆర్సి సాధిస్తాం



**నల్లబెల్లి, జూన్ 29, ప్రభాతవార్త**

త్వరలోనే ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్, పి ఆర్ సి సాధిస్తామని పి ఆర్ టి యు వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి నకిరెడ్డి మహేందర్ పేర్కొన్నారు.2026 సంవత్సరం పి ఆర్ టి యు టీఎస్ నల్లబెల్లి మండల శాఖ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదులో భాగంగా నల్లబెల్లి ప్రాథమిక ఉన్నతపాఠశాల, కేజీబీవీ ,ఆశ్రమ ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ప్రధాన కార్యదర్శి నక్కిరెడ్డి మహేందర్ మాట్లాడుతూ... ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగళి శ్రీపాల్ రెడ్డి సహకారంతో ఉపాధ్యాయులకు త్వరలోనే సర్వీసు రూల్స్ సాధించడం జరుగుతుందని, జులై 15 వరకు అందరికీ ఆమోదయోగ్యమైన హెల్త్ కార్డులు సాధిస్తామని, రానున్న3 నెలల్లో ఉద్యోగ ఉపాధ్యాయులకు మెరుగైన పిఆర్సి సాధించుటకు పిఆర్టియు టీఎస్ శక్తివంచన లేకుండా కృషి చేయడం జరుగుతుందని, కేజీబీవీ ఉపాధ్యాయులకు, ఆశ్రమ పాఠశాల ఉపాధ్యాయులకు మినిమం టైం స్కేల్ ఇస్తామని అన్నారు. ఉపాధ్యాయుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ రానున్న 3 నెలల్లో ప్రతినెల 2000 కోట్ల ద్వారా పెండింగ్ బిల్లుల పరిష్కారం అవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పి ఆర్టియు నల్లబెల్లి మండల శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఉడుత రాజేందర్ బానోతు కృష్ణ, రాష్ట్ర బాధ్యులు డి శ్రీధర్ బాబు, రవీందర్, లాక్య నాయక్, హరిచంద్ర ఉపాధ్యాయులు రవికుమార్ ,సిఆర్పి రవి తదితరులు పాల్గొన్నారు.

## అవార్డు గ్రహీత రమేష్‌కు సన్మానం



**నర్సంపేట, జూన్ 29, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల దళిత రత్న అవార్డును అందించిన అంకేశ్వరపు రమేష్‌ను ఆర్‌పిఐ (బొజ్జాతారకం) పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షులు జన్ను సాంబయ్య సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో బాబాసాహెబ్ అంబేద్కర్ ఆలోచన విధానాన్ని గ్రామ గ్రామాన వ్యాప్తి చేస్తూ అట్టడుగు వర్గాల ప్రజలకు అండగా నిలపడుతూ ప్రభుత్వం నుంచి రావాల్సిన సంక్షేమ పథకాలు నిజమైన పేదలకు అందిస్తూ భారత రాజ్యాంగంపై ప్రతి ఒక్కరికి అవగాహన కల్పిస్తూ అన్ని వర్గాల ప్రజలను విద్యారంగంలో ఆర్థిక రంగంలో ముందుకు పోయే విధంగా వాళ్లని ప్రోత్సహిస్తూ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్న అంకేశ్వర రమేష్ సేవలను గుర్తించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దళిత రత్న అవార్డు అందించిన సందర్భంగా వారిని సన్మానం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు పాల్గొన్నారు.

## నర్సంపేట నుండి అరుణాచలం ప్రత్యేక యాత్ర బస్సు

**నర్సంపేట, జూన్ 29, ప్రభాతవార్త**



తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ నర్సంపేట డిపో నుండిప్రత్యేక టూర్ ప్యాకేజి లో భాగంగా జులై 03వ తేదీన అరుణాచలం యాత్ర36సీట్లు గల సూపర్ లగ్జరి బస్సు సాయంత్రం 04గంటలకు బయలుదేరి కాణిపాకం, తమిళనాడు లో వెల్లూరు గోల్డెన్ టెంపుల్, కాంచిపురం, అరుణాచలం గిరి ప్రదక్షణ తిరుగు ప్రయాణం లో విజయవాడ కనకదుర్గమ్మ దర్శనం చేసుకుని 07వ తేదీన సాయంత్రం నర్సంపేట డిపో కి చేరుకుంటుందని డిపో మేనేజర్ సరస్వతి ఒక ప్రకటనలో తెలియజేసారు. సీట్స్ బుకింగ్ కొరకు 9704644543, 9989038476 ని సంప్రదించాలన్నారు.

## సభకు తరలిన బిజెపి నాయకులు.



**..నర్మేట, జూన్ 29 ప్రభాతవార్త :**

హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో తలపెట్టిన విజయ సంకల్ప సమ్మేళన సభకు నార్మల్ మండలస్థాయి నాయకులు సోమవారం తరలి వెళ్లారు. తరలి వెళ్లిన వారిలో మండల ఉపాధ్యక్షుడు రాజబోయిన జహంగీర్, అనిల్ కుమార్, మెతుకు సిద్ధులు, కుర్ర నరేష్, చెవుల రాజు, జంగిడి నాగేశ్వర్, పాతనారాయణరెడ్డి, లంక కృష్ణమూర్తి, గంగం గాల్ రెడ్డి, బైకాన్ రంజిత్, నక్క సంపత్, పెండ్లి శివ శేఖర్, సాంబరాజు, చల్లంశంకర్, ఆకునూరి సదాచారి, రాకేష్, యాదగిరి, తదితరులు తరలివెళ్లారు.

## ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయాలి



**దుగ్గొండి, జూన్ 29, ప్రభాతవార్త**

గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేవిధంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని స్థానిక సర్పంచ్ కామిశెట్టి ప్రశాంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎలుగొండ రామస్వామి అన్నారు. మండల కేంద్రం ప్రభుత్వ హైస్కూల్‌లో విద్యార్థులకు సోమవారం పాఠ్యపుస్తకాలు పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్కారు పాఠశాలలో చదువుకుంటే ఉచిత విద్య, ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, ప్రభుత్వం అందిస్తుందన్నారు. పాఠ్యపుస్తకాలు, దుస్తులు, ఉపకార వేతనం అందిస్తుందన్నారు. పది వార్షిక పరీక్షల్లో పాఠశాల విద్యార్థులు ఉత్తీర్ణత శాతం సాధించారన్నారు. ప్రైవేటు పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు దీటుగా పనిచేస్తారన్నారు. డిజిటల్ తరగతులతో ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధిస్తారన్నారు. విద్యార్థుల స్థాయికి వెళ్లి పాఠాలను బోధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జుమ్మిలాల్, సునిత, సంధ్యారాణి, ఎస్‌కె అహ్మద్, మహేష్, పీడీ ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి బాల్య మిత్రుల ఆర్థిక సహాయం



**నల్లబెల్లి, జూన్ 29, ప్రభాతవార్త**

ఓ స్నేహితుడు ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబానికి మేము అండగా ఉన్నామంటూ బాల్య స్నేహితులు ముందుకు వచ్చి ఆర్థిక సహాయాన్ని అందజేసిన సంఘటన మండలంలోని ముచింపుల గ్రామంలో చోటుచేసుకుంది. ముచ్చింపుల గ్రామానికి చెందిన ఎర్రబెల్లి రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా ఆ కుటుంబాన్ని మృతుడి బాల్య స్నేహితులు (199293 పదవ తరగతి బ్యాచ్) పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలియజేసి చిత్రపటం ముందు శ్రద్ధాంజలి ఘటించారు అనంతరం ఆ కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. తోటి మిత్రుడు మృతి చెందడం బాధాకరమని ఆ కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చి ధైర్యాన్ని నింపారు,ఈ కార్యక్రమంలో మృతుని కుటుంబ సభ్యులు బాల్యమితులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## నేరాలు-దారుణాలు

## ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



**బచ్చన్నపేట, జూన్ 29 ప్రభాతవార్త**

:బచ్చన్నపేట మండలం కట్కూర్ గ్రామంలో డీసీసీ బ్యాంకు, చేర్యాల శాఖ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బల్లా రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కళాకారులు మ్యాజిక్ షో ద్వారా పొదుపు ప్రాముఖ్యత, ప్రధానమంత్రి బీమా పథకాలు, బ్యాంకుల ద్వారా లభించే వివిధ రుణాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించడం వల్ల కలిగే ప్రయోజనాలను వారు వివరించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ సంపత్ కుమార్, అసిస్టెంట్ మేనేజర్ ఎల్లయ్య, సూపర్‌వైజర్ మహేష్, పీఏసీఎస్ కార్యదర్శి బలస్వామి, పీఏసీఎస్ డైరెక్టర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## వివో అంగన్వాడి భవనాలకు భూమి పూజ



**నర్మేట, జూన్ 29 ప్రభాతవార్త :**

నర్మేట మండలంలోని ఇప్పలగడ్డ గ్రామ సర్పంచ్ ధరావత్ రాజమణి ఆధ్వర్యంలో సోమవారం వివో అంగన్వాడి భవనాలకు భూమి పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచి ఇట్టబోయిన సురేష్, పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, వార్డు సభ్యులు శ్రీనివాస్, బానోత్ మంజుల బలరాం, బానోత్ కుమార్, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇట్టబోయిన కనకరాజు, ఉపాధ్యక్షుడు ఇట్టేబోయిన ప్రతాప్, ఐసిడిఎస్ సూపర్వైజర్ శృతి, సీసీ శ్రీనివాస్, అధ్యక్షురాలు రజిత, అంగన్వాడి టీచర్ శైలజ, స్థలదాత బండి వెంకన్న, ఉప్పలయ్య, సిద్దులు, కనకరాజు, బాలు, మధు, సరిత, రాజు, ప్రశాంత్ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## పిఏసిఎస్ వారోత్సవాలు ప్రారంభం..

### సహకార జెండా ఆవిష్కరించిన సీఈవో బాలస్వామి

**బచ్చన్నపేట, జూన్ 29 ప్రభాతవార్త :**



ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం(పిఏసిఎస్) వారోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా సంఘం కార్యాలయ ఆవరణలో సీఈవో బాలస్వామి సహకార జెండాను ఆవిష్కరించి వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘాలు రైతుల అభ్యున్నతికి, గ్రామీణ ఆర్థికాభివృద్ధికి కీలకంగా నిలుస్తున్నాయన్నారు. రైతులకు నాణ్యమైన సేవలు అందించడం, సహకార స్ఫూర్తిని మరింత బలోపేతం చేయడం ప్రతి ఉద్యోగి బాధ్యత అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సిబ్బంది మాసపేట నరేందర్ రెడ్డి, దయ్యాల నరేష్ తదితరులు పాల్గొన్నారు. వారోత్సవాల సందర్భంగా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు సంఘం అధికారులు తెలిపారు.

# జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉంటుంది

**- భద్రాచలం ఎమ్మెల్యే డా. వెంకట్రావు**

**- ఘనంగా టియుడబ్ల్యుజె (ఐజెయూ) భద్రాచలం డివిజన్ మహాసభ**

భద్రాచలం టౌన్, ప్రభాతవార్త :



సమాజంలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టులకు రాష్ట్ర ప్రభుత్వం అన్నివేళలా అండగా ఉంటుందని భద్రాచలం శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు స్పష్టం చేశారు. సోమవారం పట్టణంలోని రాఘవ నిలయం ( రెడ్డి సత్రం) నందు జరిగిన తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టియుడబ్ల్యుజె ఐజెయూ) భద్రాచలం డివిజన్ మహాసభ ఆ యూనియన్ జాతీయ కౌన్సిల్ మెంబర్ బి. వి. రమణారెడ్డి,జిల్లా అధ్యక్షులు జాగు వెంకటరత్నం, కార్యదర్శి జునుమాల రమేష్ ల సమక్షంలో విజ్జిగిరి రాజా కిరణ్ సభాక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన జర్నలిజం రంగంలో పనిచేస్తున్న విలేకరుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమ కార్యక్రమాల అమలుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.



అనంతరం యూనియన్ భద్రాచలం డివిజన్ మహాసభ జరిగింది. అధ్యక్షుడిగా భూక్య రంజిత్ నాయక్, ఉపాధ్యక్షులుగా బండారి మహేష్ యాదవ్, కాటా సత్యం, పందేలపల్లి వెంకటేశ్వరరావు, కార్యదర్శిగా పరుచూరి రవీంద్రబాబు, సహాయ కార్యదర్శులుగా షేక్ ఖాసిం, పసుపులేటి బాబు, కోశాధికారిగా బొల్లె రాంబాబు, కార్యవర్గ సభ్యులుగా విజయ్, బోళ్ళ వినోద్, సతీష్, వాకచర్ల శ్రీనివాసరావు, అనిల్, వెంకట్, గోసుల వెంకటేశ్వరరావులు ఎంపికయ్యారు. అదేవిధంగా ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షులుగా ఎల్. శ్రీహరి కుమార్ (టీవీ5) , ఉపాధ్యక్షులుగా వెంకటేష్, పాకాల శివగౌడ్, కార్యదర్శిగా జయరాం, సహాయ కార్యదర్శిలుగా కాసబోయిన మోహన్ రావు, జెట్టి రామకృష్ణ, కోశాధికారిగా బాల కిరణ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా అన్వేష్ రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా రామ లక్ష్మణ్, జగన్ లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి జిల్లా,అధ్యక్ష కార్యదర్శులు, పలువురు ప్రముఖులు, భద్రాచలం డివిజన్ లోని మీడియా ప్రతినిధులు శుభాకాంక్షలు తెలియజేశారు. డివిజన్ లో యూనియన్ పటిష్టతకు శక్తివంచన లేకుండా కార్యవర్గం కృషి చేయాలని సూచించారు.

## రాహుల్ ఆదర్శప్రాయులు : ఎమ్మెల్యే డా. తెల్లం

**- అందరి సహకారంతోనే అభివృద్ధి : రాహుల్**

భద్రాచలం,ప్రభాతవార్త :

ఒక అధికారి ప్రజా సేవను తన శ్వాసగా భావిస్తే ఆ ప్రాంతం ఎలా మారుతుందో చెప్పడానికి భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి బి. రాహుల్ ప్రత్యక్ష నిదర్శనం అని శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రశంసించారు. సోమవారం ఐటీడీఏ సమావేశ హాల్లో నిర్వహించిన ఐటీడీఏ పీవో రాహుల్ రెండేళ్ల పాలన సక్సెస్ మీటిలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. గత రెండేళ్లలో ఆయన తన కార్యక్షేత్రంలో సృష్టించిన విప్లవాత్మక మార్పులు, వెనుకబడిన గిరిజన ప్రాంతాల్లో నూతన ఆశలను చిగురింపజేశాయి అన్నారు.పరిపాలన అంటే కేవలం ఫైళ్లకు పరిమితం కాదని, అది అట్టడుగు వర్గాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే ఒక సాధనమని పిఓ రాహుల్ నిరూపించారన్నారు. గిరిజన సంస్కృతికి పట్టం కడుతూనే, ఆధునిక విద్య మరియు ఉపాధి రంగాల్లో మన గిరిజన విద్యార్థులు ప్రపంచంతో పోటీ పడేలా ఆయన చేసిన కృషి అనన్యం అన్నారు.విద్య, వైద్యం, వసతి, క్రీడలు మరియు సంస్కృతి అనే ఐదు ప్రధాన సూత్రాలతో ఆయన నిర్మించిన 'గిరిజన వికాస సౌధం' నేడు దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందటం తనకెంతో గర్వకారణంగా ఉందన్నారు. ఆదివాసీల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న ఈ ప్రజా బాంధవుడి ప్రస్థానం, భావి తరాలకు ఒక స్ఫూర్తిదాయక పాఠం అని అభినందించారు.

**- అందరి సహకారంతోనే సక్సెస్ : పిఓ రాహుల్**

అందరి సహకారంతోనే భద్రాచలం ఐటీడీఏని ముందుకు తీసుకు వెళ్ళటం జరిగిందని ఐటీడీఏ పీవో బి. రాహుల్ వెల్లడించారు. ప్రధానంగా జిల్లా శాసనసభ్యులు కూడా ఎంతగానో సహకరించారని తెలిపారు. యూనిట్ అధికారులు కూడా బాధ్యతాయుతంగా పనిచేశారని ప్రశంసించారు. ఐటీడీఏ లో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు గిరిజన అభివృద్ధిలో చేయి చేయి కలిపారని తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాన్ని పెంచేందుకు 'ఉద్దీపకం'




కార్యక్రమాన్ని అమలు చేశామన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఇంగ్లీష్, అర్థమెటిక్, తెలుగు భాషలపై పట్టు సాధించేలా ప్రత్యేక పుస్తకాలను రూపొందించడం వల్ల, ఏకంగా 90 మంది విద్యార్థులు అద్భుతమైన ఫలితాలను సాధించారన్నారు. విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యాలను తీర్చిదిద్దేందుకు కెరీర్ అవేర్ నెస్ ఫ్లెక్సీలను విద్యాసంస్థల్లో ఏర్పాటు చేయగా అవి ఎంతగానో సక్సెస్ ఇచ్చాయని పేర్కొన్నారు. క్రీడల్లో గిరిజన విద్యార్థుల ప్రతిభను వెలికితీస్తూ వారిని ప్రోత్సహించటం జరిగిందని సత్ఫలితాలు పాజిటివ్ గా వచ్చాయన్నారు.గిరిజన మ్యూజియంను ఆధునీకరించి, 1.5 లక్షల మంది సందర్శకులను ఆకర్షించేలా తీర్చిదిద్దడమే కాకుండా,'తెలంగాణ రాష్ట్ర గ్రామీణ పర్యాటక పురస్కారాన్ని ఢిల్లీ నుంచి రూ. 1 కోటి నిధులను అందుకోవటం సంతోషాన్ని ఇచ్చింది అన్నారు. గిరిజన ఇలవేల్పుల చరిత్రను తెలిపే పుస్తకాన్ని వెలుగులోకి తేవటం కూడా సంతోషకరమన్నారు. గిరిజన ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పిస్తూ ప్రారంభించిన 'భద్రగిరి మార్ట్, నేడు గిరిజన కుటుంబాలకు ఆర్థిక భరోసానిచ్చే ప్రధాన వేదికగా మారిందన్నారు.భద్రాచలం శాసనసభ్యులు ఐటీడీఏ యూనిట్ అధికారులు సిబ్బంది సమక్షంలో ఐటీడీఏ పీవో సాధించిన ప్రగతి పోస్టర్ ఆవిష్కరించారు.అందరి సమక్షంలో రెండు సంవత్సరాలు పూర్తి చేసినందున కేక్ కట్ చేసి ఐటిడిఏ పీఓకు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్, భద్రాచలం సర్పంచ్ పూణేమ్ కృష్ణ మరియు ఇతర శాఖల యూనిటీ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ సైజుపై ప్రభుత్వం కీలక ఉత్తర్వులు

**- 500 నుంచి 750 చ.అ. మధ్యే స్లాబ్**


**- లబ్ధిదారులపై అదనపు భారం తగ్గించేందుకు జీఓ**

**- ఎంపీడీవో జములా రెడ్డి హౌసింగ్ ఏఈ ఉదయ్ కిరణ్**

**బూర్గంపహాడ్, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ సొంతిల్లు ఉండాలన్న లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని వేగంగా పూర్తి చేస్తోంది. తాజాగా ఇళ్ల స్లాబ్ సైజుపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది.గృహ నిర్మాణశాఖ ఎండీ వీ.పీ. గౌతమ్ ఇటీవల జీఓ విడుదల చేశారని బూర్గంపహాడ్ ఎంపీడీవో జమలారెడ్డి, హౌసింగ్ ఏఈ ఉదయ్ కిరణ్ లు తెలిపారు. ఇకపై ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ విస్తీర్ణం 500 నుంచి 750 చదరపు అడుగుల మధ్య మాత్రమే ఉండాలని జీఓలో స్పష్టం చేశారు.స్లాబ్ ముందువైపు 3 అడుగులు మిగతా వైపులా 1 అడుగు మాత్రమే పొడిగించేందుకు అనుమతి ఉందని అధికారులు వివరించారు. దీనికి మించి స్లాబ్ విస్తీర్ణం పెంచరాదని,పేద, మధ్యతరగతి లబ్ధిదారులపై అదనపు ఖర్చు భారం పడకూడదనే ఉద్దేశంతోనే ఈ పరిమితులు విధించినట్లు హౌసింగ్ కార్పొరేషన్ పేర్కొంది. స్లాబ్ సైజులు పెంచడం వల్ల ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షల ఆర్థిక సహాయం కంటే అదనపు ఖర్చు భారం పడుతోందని గుర్తించిన కార్పొరేషన్ ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు.ఇళ్లకు నీడ అవసరమైతే అన్ని వైపులా



స్లాబ్ పొడిగించే బదులు తలుపులు, కిటికీలపై సన్షెడ్లు/చజ్జాలు ఏర్పాటు చేసుకోవాలని ప్రభుత్వం సూచించిందని తెలిపారు. ఇంటి ముందు భాగంలో అదనపు నీడ అవసరమైతే ఆర్సీసీ స్లాబ్‌కు బదులు జీఐ షీట్ ఆధారిత షెడ్లు వేసుకోవాలని తెలిపారు.ఈ కొత్త నిబంధనలు పునాది దశ, బేస్మెంట్ లెవల్, గోడల దశలో ఉన్న ఇళ్లకు, అలాగే గ్రౌండింగ్ చేసి ఇంకా నిర్మాణం ప్రారంభించని ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మాత్రమే వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇప్పటికే స్లాబ్ వేసిన ఇళ్లకు ఈ నిబంధనలు వర్తించవని పేర్కొన్నారు.లబ్ధిదారులు కొత్త మార్గదర్శకాల ప్రకారమే ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, అనుమానాలు ఉంటే మండల హౌసింగ్ అధికారులను సంప్రదించాలని ఎంపీడీవో జమలారెడ్డి, ఏఈ ఉదయ్ కిరణ్ సూచించారు.




## బిజెపి ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు

భద్రాచలం టౌన్ ప్రభాతవార్త :



భారతీయ జనతా పార్టీ ఓబిసి మోర్చా మండల అధ్యక్షుడిగా దేవరపల్లి వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాలను ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్ రెడ్డి సోమవారం ఆ పార్టీ కౌన్సిల్ నెంబర్ కుంజా ధర్మ, సీనియర్ నాయకులు ములిశెట్టి రామ్మోహన్ రావు, నిడదవోలు నాగబాబు సమక్షంలో అందజేశారు.ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. తన నియామకానికి సహకరించిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం శక్తివంచన లేకుండా శ్రమిస్తానని వెల్లడించారు.

## ఐక్య ఉద్యమాలతోనే ఆదివాసీలకు మనుగడ

దుమ్ముగూడెం ప్రభాతవార్త :

ఆదివాసులు ఐక్యతతో ప్రజా ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆదివాసీ నాయకులు పిలుపునిచ్చారు సోమవారం దుమ్ముగూడెం మండల కేంద్రంలో అత్యవసర సమావేశంలో పలువురు ఆదివాసి నాయకులు మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఆదివాసీలకు ఉన్న చట్టాలు అంతమయ్యే ప్రమాదకరం ఉందని రానున్న రోజుల్లో ఆదివాసి చట్టాలు హక్కులు మనుగడ కనబడే పరిస్థితి లేకుండా ఉందని ఆ చట్టాలను కాపాడే దిశగా ఉద్యమాన్ని చేపట్టాలని అన్నారు ఆదివాసీలకు ఉన్న చట్టాలను హక్కులను ఉద్యమాల ద్వారా కాపాడుకోవాలని వారు పిలుపునిచ్చారు గిరిజన చట్టాలకు అనుగుణంగా ప్రతి ఒక్క ఆదివాసి బిడ్డకు న్యాయం జరిగే విధంగా పనిచేయాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో ఏవీఎస్పీ జిల్లా అధ్యక్షుడు సోందె మల్లుదొర ఆదివాసి సేన నాయకుడు కాటెబోయిన శ్రీను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తెల్లం హరికృష్ణ పాయం వెంకటేష్ కుంజా నాగేష్ కాటిబోయిన వెంకటేష్ సాయి తదితరులు పాల్గొన్నారు.



## వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

**- వైద్య సేవలు అందించడంలో నిర్లక్ష్యం తగదు**

**- అడిషనల్ డీఎంహెచ్వో డాక్టర్ సైదులు**

**జూలూరుపాడు, ప్రభాతవార్త, జూన్ 29:**

కాలానుగుణంగా వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల వైద్యులతో పాటు వైద్య సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, రోగులకు వైద్య సేవలు అందించడంలో నిరక్ష్యం తగదని అడిషనల్ డిఎంహెచ్ఓ డాక్టర్ సైదులు ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలో నిర్వహణ రికార్డులతో పాటు, ఆసుపత్రిలో నిల్వ ఉన్న మందులను పరిశీలించారు. ఆసుపత్రికి వస్తున్న రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ గా వచ్చే వ్యాధుల బారిన పడిన రోగులకు సకాలంలో వైద్యంతో పాటు వైద్య సేవలు అందించే విధంగా సిబ్బంది కృషి చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు అవసరమైన మందులతో పాటు పాముకాటు, కుక్కకాటు



ఇంజక్షన్లు కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉన్నట్లు తెలిపారు. ప్రజలకు వైద్య సేవలు అందించడంలో నిరక్ష్యంగా వ్యవహరించే వైద్యులు, సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తప్పవని తెలిపారు. గ్రామీణ వైద్యులు పరిమితికి మించి వైద్య సేవలు అందించకూడదని, ఇందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఆసుపత్రులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికే పలుసార్లు గ్రామీణ వైద్యులతో సమావేశాలు నిర్వహించి తగు సూచనలు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి వెంకటేశ్వర్లు, ఫార్మాసిస్ట్ శశికళ ఉన్నారు.

## శివాలయంలో ఏరువాక పౌర్ణమి పూజా కార్యక్రమాలు

**అన్నపురెడ్డిపల్లి, జూన్ 29(ప్రభాతవార్త):**

తొలకరి చిరుజల్లులు ప్రారంభంతో రైతుల వ్యవసాయ సాగుపనులకు శుభప్రదంగా భావించే ఏరువాక పౌర్ణమి పూజా కార్యక్రమాలను భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి(శివాలయం)ఆలయంలో సోమవారం నిర్వహించారు. జ్యేష్ఠ పౌర్ణమి సందర్భంగా పూజారులు నాగలీతో పాటు దుక్కిటేఎడ్లుకు పూజలు చేశారు. వర్షాలతో సమృద్ధిగా పంటలు పండి. రైతులు సంక్షేమంగా ఉండాలని ఆకాంక్షి స్తూ ఆలయంలోని వాయు లింగంకు మహిళలు జలాభిషేకాలు చేశారు. అనంతరం మద్ద మహేష్ కవిత దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. పౌర్ణమిని పురస్కరించుకొని



నిర్వహించిన పూజ కార్యక్రమాల్లో మరీదు కృష్ణయ్య కృష్ణమ్మ దంపతులు. ఆర్మీ జవాన్ సుభాష్. ఆలయ మేనేజర్ వెంకటరమణ. ఆలయ సిబ్బంది సంపత్. రైతులు. భక్తులు ఉన్నారు.

## అరుదైన ముఖ ఎముకల శస్త్రచికిత్స విజయవంతం

**- పెద్దాసుపత్రులకు తీసిపోని ప్రభుత్వ ఆసుపత్రి సేవలు**

**- ప్రభుత్వ ఆసుపత్రిలో అరుదైన ముఖ ఎముకల శస్త్రచికిత్స విజయవంతం**

**- విరిగినపై దవడకు టైటానియం ప్లేటింగ్‌తో ఆధునిక ఆపరేషన్**

**- రూ.70 వేల ఖర్చయ్యే శస్త్రచికిత్స ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచితంగా**



**పాల్వంచ టౌన్, జూన్ 29, ప్రభాతవార్త:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ సామాజిక ఆరోగ్య కేంద్రం లో మరో అరుదైన శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు తమ నైపుణ్యాన్ని చాటుకున్నారు. పెద్ద కార్పొరేట్ ఆసుపత్రుల్లో మాత్రమే చేసే క్లిష్టమైన ముఖ ఎముకల శస్త్రచికిత్సను పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రిలో విజయవంతంగా పూర్తి చేశారు. పాల్వంచ మండలం ధాబా నగర్‌కు చెందిన 35 ఏళ్ల బానోత్ కరణ్ సింగ్ కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగిన దాడిలో ఎడమ ముఖ భాగానికి తీవ్ర గాయాలపాలయ్యారు. ఆయనను పాల్వంచ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా వైద్యులు పరీక్షలు నిర్వహించి పై దవడ-చెంప ఎముకలు విరిగినట్లు గుర్తించారు. రోగి పరిస్థితిని పరిశీలించిన వైద్యులు వెంటనే శస్త్రచికిత్సకు నిర్ణయించారు. ఓరోమాక్సిలరీ ఫేసియల్ సర్జన్ డా. మోహన్ వంశీ కృష్ణ నేతృత్వంలో, మత్తు వైద్యుడు డా. శంకర్ రావు సహకారంతో దాదాపు



రెండున్నర గంటల పాటు సాగిన క్లిష్టమైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. టైటానియం ప్లేటింగ్ ద్వారా విరిగిన ఎముకలను యథాస్థానంలో అమర్చడంతో పాటు ఇంటర్ మ్యాక్సిలరీ ఫిక్సేషన్ ద్వారా దవడలను స్థిరపరిచారు. ప్రస్తుతం రోగి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండి వైద్యుల పర్యవేక్షణలో కోలుకుంటున్నారు. శస్త్రచికిత్సలో నర్సులు పి. రేవతి, ఎస్. జ్యోతి, సీహెచ్. జగదీష్ కీలక సహకారం అందించారు. సాధారణంగా రూ.60 వేల నుంచి రూ.70 వేల వరకు ఖర్చయ్యే ఈ తరహా శస్త్రచికిత్సలు తృతీయ స్థాయి ఆసుపత్రుల్లో మాత్రమే నిర్వహిస్తుంటారు. అలాంటి అత్యాధునిక వైద్యసేవను గిరిజన ప్రాంతంలోని పాల్వంచ సామాజిక ఆరోగ్య కేంద్రంలో విజయవంతంగా నిర్వహించడం ప్రభుత్వ ఆసుపత్రుల సామర్థ్యాన్ని మరోసారి నిరూపించిందని వైద్యులు తెలిపారు. విజయవంతమైన శస్త్రచికిత్స నిర్వహించిన వైద్య బృందాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయకర్త డా. రవి బాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రామ్ ప్రసాద్, ఆర్ఎంఓ డా. దొర అభినందించారు. గిరిజన ప్రాంత ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే నాణ్యమైన, అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు వాటిని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

## గ్రామపంచాయతీ అభివృద్ధికి సహకరించండి

**- జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించిన అంజుపాక సర్పంచ్ శాంతమ్మ**



**దుమ్ముగూడెం ప్రభాతవార్త :** అంజుబాక గ్రామపంచాయతీ అభివృద్ధికి సహకరించి నిధులు మంజూరు చేయాలని దుమ్ముగూడెం మండలం అంజుపాక గ్రామపంచాయతీ సర్పంచ్ కొమరం శాంతమ్మ జిల్లా కలెక్టర్ కు సోమవారం వినతి పత్రం అందించారు ఈ సందర్భంగా గ్రామపంచాయతీ సర్పంచ్ మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన అంజుబాక పంచాయతీ పరిధిలో జెడ్ వీరభద్ర పురం అంజుబాక గిరిజన రెవెన్యూ గ్రాములు అభివృద్ధికి నోచుకోలేదనీ వందకు వందశాతం గ్రామపంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పనులు పూర్తి చేసినప్పటికీ పంచాయతీకి రావలసినటువంటి 40 మెటీరియల్ పేమెంట్ నిధులు మాకు కేటాయించడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు ఒక్క సి సి రోడ్ లేదనీ సి సి రోడ్లు మంజూరు చేయాలని జెడ్ వీరభద్రపురం గ్రామంలో ఉన్న ఎంపీపీఎస్ పాఠశాలకు కిచెన్ షెడ్ ప్రహరీ గోడ నిర్మించాలని శిధిల వ్యవస్థకు చేరిన పాఠశాల భవనాని తొలగించాలని అంజుబాక వీరభద్రపురం అంగన్వాడీ కేంద్రాల్లో ప్రహరీ గోడలు నిర్మించాలని కలెక్టర్కు తెలిపారు దీంతో కలెక్టర్ అంకిత్ స్పందిస్తూ అంజుపాక గ్రామపంచాయతీలో పర్యటించి సమస్యలను త్వరలోనే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు వినతి పత్రం ఇచ్చిన వారిలో వార్డు సభ్యులు కొమరం చంటి గ్రామస్తులు నరసింహారావు చిట్టిబాబు వీరేష్ సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు .

## ఇరిగేషన్‌లో అవినీతి చేప

**- లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఇరిగేషన్ ఎఈఈ**

**అశ్వారావుపేట టౌన్, జూన్ 29 ప్రభాతవార్త:**



ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అవినీతి అధికారుల గుండెల్లో ఏసీబీ (అవినీతి నిరోధక శాఖ) అధికారులు మరోసారి వణుకు పుట్టించారు. అశ్వారావుపేట పట్టణంలో ఓ రైతు నుండి రూ.2 లక్షల భారీ మొత్తాన్ని లంచంగా తీసుకుంటూ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఎఈఈ) ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు. వివరాల్లోకి వెళ్తే.. అశ్వారావుపేట పట్టణంలోని దొంతికుంట చెరువు నుండి తన పొలానికి మట్టి తోలుకునేందుకు ఓ స్థానిక రైతు ఇరిగేషన్ అధికారులను ఆశ్రయించారు. అయితే ఆ మట్టి తరలింపునకు అనుమతి ఇవ్వాలంటే రూ.2 లక్షలు లంచం సమర్పించుకోవాలని ఇరిగేషన్ ఏఈఈ ఎల్ శ్రీనివాస్ సదరు రైతును డిమాండ్ చేశారు. అంత పెద్ద మొత్తం ఇచ్చుకోలేక, అవినీతి అధికారికి బుద్ధి చెప్పాలనుకున్న రైతు తక్షణమే ఖమ్మం రేంజ్ ఏసీబీ అధికారులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు.

**- కార్యాలయంలోనే రెడ్ హ్యాండెడ్‌గా అరెస్ట్:**

రైతు ఇచ్చిన ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఖమ్మం రేంజ్ ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ ఆధ్వర్యంలోని బృందం పక్కా వ్యూహంతో అశ్వారావుపేటలోని ఇరిగేషన్ కార్యాలయం వద్ద నిఘా పెట్టింది. సోమవారం ఏఈఈ శ్రీనివాస్ తన కార్యాలయంలో రైతు నుండి రూ.2 లక్షల నగదును స్వీకరిస్తుండగా ఏసీబీ అధికారులు ఒక్కసారిగా దాడి చేసి ఆయనను రెడ్ హ్యాండెడ్‌గా (నగదుతో సహా) పట్టుకున్నారు. అధికారి చేతులకు కెమికల్ పరీక్షలు నిర్వహించి లంచం తీసుకున్నట్లు నిర్ధారించారు. అనంతరం కార్యాలయంలోని పలు రికార్డులను స్వాధీనం చేసుకుని ఏఈఈ శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఉమ్మడి జిల్లాలో వరుసగా జరుగుతున్న ఏసీబీ దాడులు ప్రభుత్వ కార్యాలయాల్లో కలకలం రేపుతున్నాయి.

## స్నేహమంటే నువ్వు పడిపోతే నిన్ను లేపే చేయి

**- తండ్రిని, కొడుకును కోల్పోయిన మిత్రుడి కుటుంబానికి 80 వేలు అందించిన 26 ఏళ్లనాటి బ్యాచ్**

**సారపాక, ప్రభాతవార్త:** సారపాక లో ఇటీవల ముత్యాలమ్మపేట దారిలో ఒక బుల్డోజర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఆ క్షణంలో చెలికాని ప్రవీణ్ తన 15 ఏళ్ల కొడుకు గణేష్‌ను కోల్పోయాడు. తాను కూడా మృత్యువు అంచు వరకు వెళ్లి తిరిగొచ్చాడు. ఆస్పత్రి బెడ్ మీద క్రిటికల్ కండిషన్‌లో ఉన్న ప్రవీణ్‌కు తెలియదు... తన 26 ఏళ్ల నాటి క్లాస్‌మేట్స్ తన కోసం ఏం చేస్తున్నారో. 26 ఏళ్ల బంధం... ఒక ఫోన్ కాల్‌తో మళ్లీ కలిసింది 19992000లో భద్రాచలం కొర్రాజుల గుట్ట స్కూల్లో 10వ తరగతి కలిసి చదివారు వీళ్లు. రమేష్, రాజు, శేషగిరి, దుర్గారావు, పురుషోత్తం, మురళి, కోటేశ్వరావు, లక్ష్మణ్, సిద్ధిరాజు... రోజులు గడిచాయి, ఉద్యోగాలు వచ్చాయి, ఊళ్లు వేరయ్యాయి. కానీ మనసులు మాత్రం విడిపోలేదు. ప్రవీణ్ ప్రమాదం గురించి తెలియగానే "బ్యాచ్ వాట్సాప్ గ్రూప్" ఒక్కసారిగా మేల్కొంది. ఎవరి స్థాయిలో వాళ్లు... ఎవరి వంతు వాళ్లు. లెక్కలు చూడలేదు, కారణాలు అడగలేదు. "మన ప్రవీణ్ ఆపదలో ఉన్నాడురా" అనే ఒక్క మాట చాలు. ఆదివారం సారపాకలో ప్రవీణ్ ఇంటి కి వెళ్లి 55 వేల రూపాయలు పెట్టారు. ఇది వైద్యానికి, మందులకు అన్నారు. పక్కనే 3 నెలలకు సరిపడా 15 వేల రూపాయల సరుకులు అందించారు. 199798లో సారపాక గవర్నమెంట్ స్కూల్లో 7వ తరగతి కలిసి చదివిన స్నేహితులు కూడా వచ్చారు. వాళ్లు కూడా 10 వేల రూపాయలు అందించారు. ప్రవీణ్, మేమంతా ఉన్నాం. ధైర్యంగా ఉండు అని భరోసా ఇచ్చారు. ప్రవీణ్ భార్య కళ్లనీరు ఆపుకోలేకపోయింది. "అయ్యా చనిపోయాడు... కొడుకు పోయాడు... భర్త ఆస్పత్రిలో ఉన్నాడు. ఈ లోకంలో ఎవరూ లేరనుకున్నా. వీళ్లు వచ్చి మళ్లీ జీవితం ఉందని చూపించారు అని కన్నీళ్లతో చెప్పింది. స్నేహితులు మాత్రం ఒక్క మాట అన్నారు ప్రవీణ్... మార్కులు తక్కువ వచ్చినా, ఫెయిల్ అయినా నువ్వు మా బెంచ్ పార్టనర్‌వి. ఆపదలో మిత్రుడికి చేయి అందించడం కంటే పెద్ద చదువు ఏముంది? పెద్ద పెద్ద స్టేటస్‌లు పెట్టుకుంటారు . కష్టంలో ఎవరూ రారు. వీళ్లు వచ్చారు. స్నేహానికి ఇదే నిజమైన అర్థం అని సారపాక వాసులు చెప్పుకుంటున్నారు.



# రూ.1.65 కోట్లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

**- ప్రణాళికాబద్ధ అభివృద్ధితోనే ప్రజలకు మెరుగైన సౌకర్యాలు**

**- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**

**పాల్వంచ, జూన్ 29 ప్రభాతవార్త:**

పాల్వంచ మండలంలో రూ.1.65 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి పనులతోనే ప్రాంతం ప్రగతి సాధిస్తుందని అన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. రూ.1.65 కోట్ల నిధులతో చేపడుతున్న పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజాధనంలో ప్రతి పైసా సద్వినియోగం కావాలని, పనుల్లో ఎలాంటి నిరక్ష ్యర్లి చోటుచేసుకోకుండా అధికారులు



నిరంతరం పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. ప్రణాళికాబద్ధంగా నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# బసవతారక కాలనీలో సీసీ రోడ్డు ప్రారంభం

**పాల్వంచ టౌన్, జూన్ 29, ప్రభాతవార్త:**

పాల్వంచ మండల పరిధిలోని బసవతారక కాలనీ గ్రామపంచాయతీ పరిధిలో హెచ్ కన్వెన్షన్ హాల్ వద్ద నిర్మించిన సీసీ రోడ్డును స్థానిక ఎమ్మెల్యే సాంబశివరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూక గణేష్, షాబీర్ భాషా, ఎంపీడీవో, పీఆర్ డీఈ, ఎంపీవో, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ డీఆర్‌వో క్రాంతి, పీఆర్ ఏఈ శ్రీనివాస్, సర్పంచ్ జరుపుల కాశమ్మ, ఉప సర్పంచ్ భాగ్యమ్మ, వార్డు సభ్యులు భవాని, వాణి విద్య, మూడో వార్డు సభ్యురాలు లలిత, హెచ్ కన్వెన్షన్ హాల్ యజమాని నల్ల సురేష్ రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి అవసరమైన మౌలిక



సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని, సీసీ రోడ్డు నిర్మాణంతో స్థానిక ప్రజలకు రాకపోకలు మరింత సౌకర్యవంతంగా మారనున్నాయని ఎమ్మెల్యే తెలిపారు.

# ఏరియాలో ఉధృతంగా ప్రారంభమైన అధికారుల రిలే నిరాహార దీక్షలు

**- సింగరేణి చరిత్రలోనే ప్రజా ప్రభుత్వంలో ఇదే తొలిసారి**

**- జూలై 13 వరకు పక్షం రోజుల పాటు ఆందోళనలు**

**రుద్రంపూర్, జూన్ 29 ప్రభాతవార్త:** సింగరేణి సంస్థ చరిత్రలో మున్నెన్నడూ లేని విధంగా అధికారులు ప్రత్యక్ష ఉద్యమబాట పట్టారు. తమ దీర్ఘకాలిక న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో యాజమాన్యం, ప్రభుత్వం నిరక్ష ్యర్లిగా వ్యవహరిస్తున్నాయని నిరసిస్తూ.. కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంఓఏఐ) ఎస్సీసీఎల్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం నుంచే రిలే నిరాహార దీక్షలు ఉధృతంగా ప్రారంభమయ్యాయి. కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ ఆఫీస్ వద్ద అధికారులు దీక్షా శిబిరాన్ని ఏర్పాటు చేసి నిరసన చేపట్టారు. నేటి జూన్ 29 నుంచి జూలై 13 వరకు పక్షం రోజుల పాటు ఈ రిలే నిరాహార దీక్షలు సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలలో కొనసాగనున్నాయి. ఈ ఆందోళన కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు ఉపేందర్ (డివై. ఎస్ఈ), యశస్వి (ఈ.ఈ), భరత్ చంద్ర (డివై మేనేజర్), మోనిక, గాయత్రి (సీనియర్ అండర్ మేనేజర్), వీ. శ్రీనివాస్ (అండర్ మేనేజర్) తదితర అధికారులు నిరాహార దీక్షలో కూర్చున్నారు. రానున్న రోజుల్లో అసోసియేషన్ ప్రతినిధులు, వివిధ విభాగాలకు చెందిన అధికారులు ఈ దీక్షలను వరుసగా కొనసాగించనున్నారు. ఈ దీక్షా కార్యక్రమానికి




సింగరేణి అధికారులు భారీగా తరలివచ్చి మద్దతు ప్రకటించారు. ఇందులో ఎస్ఓ టు జీఎం గోవింద రావు, వీకే సీఎం పిఓ, యూనియన్ కొత్తగూడెం ఏరియా అధ్యక్షులు నరసింహ రావు, ఏరియా ఇంజనీర్ రామకృష్ణ, ఏరియా సేఫ్టీ ఆఫీసర్ వెంకటేశ్వర్ రావు, క్వాలిటీ మేనేజర్ సత్యనారాయణ రాజు, ఎస్టేట్ ఆఫీసర్ తౌర్య, ఏఎస్ఓ అభిలాష్‌లతో పాటు ఇతర విభాగాల అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొని సంఘీభావం తెలిపారు. పే అప్‌గ్రేడేషన్ కోల్ ఇండియాలో అమలు చేసిన విధంగానే సింగరేణి అధికారులకు కూడా తక్షణమే పే అప్‌గ్రేడేషన్ అమలు చేయాలని, నిలిచిపోయిన పీఆర్పీ (పెర్ఫార్మన్స్ రిలేటెడ్ పే) బకాయిలను వెంటనే విడుదల చేయాలని, కోల్ ఇండియా అధికారులతో సమానంగా అన్ని రకాల అలవెన్సులు, ఇతర సేవా ప్రయోజనాలను కల్పించాలన్నారు. తాము గత కొంతకాలంగా శాంతియుతంగా, విధులకు ఆటంకం కలగకుండా బ్లాక్ బ్యాడ్జీలు ధరించి నిరసనలు తెలుపుతున్నామని గుర్తు చేశారు. ఇప్పటికైనా యాజమాన్యం స్పందించి తమ డిమాండ్లను నెరవేర్చాలని, లేనిచో ఆందోళనలు మరింత తీవ్రతరం అవుతాయని హెచ్చరించారు.

# పేదలకు నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ

**రుద్రంపూర్, జూన్ 29 ప్రభాతవార్త:**

వట్టికొండ రజిని జయంతి సందర్భంగా గౌతమ్ పూర్ లో పేదలకు



నిత్యావసర సరుకులు, కొత్త బట్టలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొని నిరుపేద కుటుంబాలకు బియ్యం, కిరాణా సరుకులు, దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఏఐటియుసి ఏరియా బ్రాంచ్ కార్యదర్శి వట్టికొండ మల్లికార్జున్ మాట్లాడుతూ... వట్టికొండ రజిని ఆశయాలను స్మరించుకుంటూ సమాజంలోని బలహీన వర్గాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇలాంటి సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రుద్రంపూర్ ఉపసర్పంచ్ తోటరాజు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# రైల్వేలో ఉద్యోగం సాధించిన సాయికుమార్‌కి సన్మానం...

**కొత్తగూడెం ఎడ్యుకేషన్, జూన్ 29 ప్రభాతవార్త:**



జిల్లా కేంద్ర గ్రంథాలయం భద్రాద్రి కొత్తగూడెంలో గత కొద్ది సంవత్సరాలుగా పోటీ పరీక్షలకు సిద్ధపడి ఇండియన్ రైల్వే అసిస్టెంట్ దక్షిణ మధ్య రైల్వే లోకో పైలట్గా సిహెచ్ సాయికుమార్ ఉద్యోగం సాధించారు. 2024 నోటిఫికేషన్ లో ఉద్యోగం సాధించిన సాయికుమార్ ని గ్రంథాలయ చైర్మన్ పసుపులేటి వీరబాబు శాలువా కప్పి సన్మానించారు. నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన సాయికుమార్ తండ్రి నిత్య కూలిగా ఉంటూ ఎంతో కష్టపడి చదివించారు. చదివే లక్ష ్యంగా ఉద్యోగమే ధ్యేయంగా తలంచి ఎంతగానో కష్టపడి ఉద్యోగం సాధించిన సాయికుమార్ ని అందరూ ఆదర్శంగా తీసుకొని గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధపడుతున్న విద్యార్థిని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సినీ గేయ రచయిత చిరంజన్, వాసు చార్టెడ్ అకౌంట్, గ్రంథ పాలకురాలు జి మణి మృదుల, గ్రంథాలయ సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాఠకులు పాల్గొని ఉద్యోగం సాధించిన సాయికుమార్ కి శుభాకాంక్షలు తెలిపారు.




# పెద్దమ్మగుడిలో వైభవంగా చండీహోమం

**పాల్వంచ టౌన్, జూన్ 29, ప్రభాతవార్త:**



పౌర్ణమిని పురస్కరించుకుని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కేశవాపురం -జగన్నాథపురం గ్రామంలోని శ్రీ కనకదుర్గ దేవస్థానం (పెద్దమ్మగుడి)లో సోమవారం చండీహోమం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. దేవాలయం నుంచి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలు, వేదమంత్రాల నడుమ యాగశాలకు తీసుకువచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండపారాధన, గణపతి పూజల తర్వాత చండీహోమం నిర్వహించి, పూర్ణాహుతితో కార్యక్రమాన్ని ముగించారు. ఈ చండీహోమంలో 25 మంది దంపతులు ఒక్కొక్కరు రూ. 2,516 రుసుము చెల్లించి పాల్గొన్నారు. హోమం అనంతరం అర్చకులు, వేదపండితులు పాల్గొన్న దంపతులకు ఆశీర్వచనాలు అందించి అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాన్ని అందజేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి, దేవస్థాన సిబ్బంది, అర్చకులు, వేదపండితులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# పేదలకు నిత్యావసర సరుకులు, దుస్తులు పంపిణీ

**కొత్తగూడెం టౌన్, జూన్ 29 ప్రభాతవార్త:**



టీఎస్టీటీఎఫ్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శుల భూక్య మోహన్ రాథోడ్, సభావత్ బాలకృష్ణ చౌహాన్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల వివిధ సమస్యలపై భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖ అధికారి వాసంతి ని కలిసారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ రాములు నాయక్ హాజరై పలు సమస్యల పరిష్కారానికి డీఈఓ తో మాట్లాడడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం వర్క్ అడ్జస్ట్మెంట్ నిర్వహించే నేపథ్యంలో ముందుగా జిల్లాలో ఎఫ్ఎల్ఎన్ జిల్లా ప్యానల్ ఇన్స్పెక్షన్ కు సెలెక్ట్ అయిన ఉపాధ్యాయుల స్థానంలో మరొక ఉపాధ్యాయుని అడ్జస్ట్ చేసి తర్వాత మాత్రమే వారిని రిలీవ్ చేయాలనీ, భద్రాది కొత్తగూడెం జిల్లా సంపూర్ణంగా ఏజెన్సీ ప్రాంతం కాబట్టి అక్కడ చదివే పిల్లలు 95 శాతం మంది ఎస్టి, ఎస్సి సామాజిక వర్గానికి చెందిన పేద పిల్లలే చదువుతున్నారని అన్నారు. రేషనలైజేషన్ పేరిట గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలను ఎత్తిస్తే పిల్లల డ్రాప్స్ పెరుగుతుందని, ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరూ ఉపాధ్యాయులు ఉండేలా.. 1:10 నిష్పత్తిలో ఉపాధ్యాయులు విద్యార్థులు ఉండేలా... యూపిఎస్ లో సబ్జెక్టుకు ఒక టీచర్ ఉండేలా, హైస్కూల్లో తెలుగు మీడియంలో సబ్జెక్టుకు ఒక టీచర్, ఇంగ్లీష్ మీడియంలో సబ్జెక్ట్ కి ఒక టీచర్ కనీసం ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యలన్నీటిపైన డీఈఓ స్పందించి సత్వరమే పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి టీఎస్టీటీఎఫ్ రాష్ట్ర గౌరవ సలహాదారులు రత్నాకర్, రాష్ట్ర కార్యదర్శి చందర్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీఎస్టీటీఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్య బాబూలాల్, అజ్మీర హరిదాసు, లక్ష్మీదేవి పల్లి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు హలావత్ కృష్ణ వీరభద్రం, ములకలపల్లి మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.రవి తదితరులు పాల్గొనడం జరిగింది.

# మధిర రామాలయాన్ని సందర్శించిన డిప్యూటీ సీఎం..

**- ఆలయ పునర్నిర్మాణానికి భక్తుల వినతి..**

**- సానుకూలంగా స్పందించిన డిప్యూటీ సీఎం..**

**మధిర జూన్ 29 ప్రభాతవార్త :** పట్టణంలో వేంచేసి ఉన్న రామాలయం



పునర్నిర్మాణం అభివృద్ధి పనులకు సంబంధించి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. సోమవారం ఆయన సతీమణి నందిని విక్రమార్కతో కలిసి రామాలయాన్ని సందర్శించారు. ఆలయానికి చేరుకున్న వారికి ఆలయ కమిటీ ఘన స్వాగతం పలికింది. ఆలయ అర్చకులు జనార్ధన చార్యులు పలువురు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామివారి ఎదుట ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వాదాలు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు భక్తులు వర్తక వ్యాపార వర్గాల ప్రముఖులు ఆయనను కలిసి వినతి పత్రాలను అందజేశారు. ప్రాచీన మహిమాన్విత ఆలయంగా ఉన్న సీతారామచంద్రస్వామి ఆలయం అభివృద్ధికి సంబంధించి ఆయన ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయానికి ఉన్న భూమి ఆలయం లో చేపట్టవలసిన అభివృద్ధి పనులు ఇతర అంశాలకు సంబంధించి వైఖానన ఆగమన శాస్త్ర నియమాలను అనుసరించి తదనగుణంగా అవసరమైన రీతిలో నిధుల మంజూరుకు కృషి చేయనున్నట్లు ఆయన పరోక్షంగా వెల్లడించారు. కాగా ఆలయానికి అనుకొని ఉన్న కళ్యాణ మండపం పరిసర ప్రాంతంలోని ఖాళీ భూమి కి చెందిన వర్తక వ్యాపార వర్గాల ప్రముఖులు ఈ భూమిని ఆలయానికి దానంగా ఇవ్వడం లేదా ప్రత్యామ్నాయంగా సేకరించడం ద్వారానే రామాలయ అభివృద్ధి ముడిపడి ఉన్నదని స్థానిక అర్చకులు ముఖ్య నాయకులు పేర్కొనడం గమనార్హం. పట్టణంలో ఉన్న ప్రాచీన ముఖ్య ఆలయాలలో రామాలయం తో పాటు శ్రీ



మృత్యుంజయ స్వామి ఆలయ అభివృద్ధికి కూడా డిప్యూటీ సీఎం గతంలోనే హామీ ఇచ్చి ఉన్న నేపథ్యంలో మరో మారు ఈ విషయాన్ని మృత్యుంజయ స్వామి ఆలయ మాజీ చైర్మన్ పాటిబండ్ల సత్యంబాబు ఆయన దృష్టికి తీసుకురాగా, ఈ అంశాలు తన దృష్టిలో ఉన్నాయని డిప్యూటీ సీఎం సానుకూలతను వ్యక్తం చేశారు. కాగా త్వరలోనే ఆలయాల అభివృద్ధికి సంబంధించి ఆగమన శాస్త్ర పండితుల సలహాలను ప్రతిపాదనలను తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

**- ఆలయ ఉద్యోగుల జీతాలపై తక్షణ స్పందన :**

మధిర మృత్యుంజయ స్వామి ఆలయంతో పాటు రాష్ట్రంలోని పలు ఆలయాలలో కొంతకాలంగా విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు జీతభత్యాల చెల్లింపులలో ఇతర ఉద్యోగ సంబంధ అంశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగిని రాధా డిప్యూటీ సీఎం దృష్టికి ఆవేదనపూర్వ వినతిని అందజేసింది దీనిపై స్పందించిన ఆయన తక్షణమే దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ తో సమస్యపై నివేదికను పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పారుపల్లి విజయ్ కుమార్ తలుపుల వెంకటేశ్వర్లు వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి సూరంశెట్టి కిషోర్ మిర్యాల రమణ గుప్తా రంగా హనుమంతరావు పాటిబండ్ల సత్యంబాబు టీవీ రెడ్డి మొండితోక సుధాకర్ నాగార్జున ఇది అనిల్ కుమార్ కరివేద సుధాకర్ తన్నీరు రామకృష్ణ నిడమానూరు వంశీ మున్సిపల్ చైర్ పర్సన్ సామినేని సుజాత రామనాథం వైస్ చైర్మన్ కోనాధని కుమార్ కమిషనర్ ఇజ్రాయిల్ పాల్ ఆలయ కమిటీ కి చెందిన రాజశేఖర్ కౌన్సిలర్లు నకిరేకంటి రాజేశ్వరి నాగార్జున బెజ్జం రాజు పట్టణ ప్రముఖ వ్యాపార వర్గాల చెందిన కోనా జనార్దన్ రావు పుల్లఖండం సత్యనారాయణమూర్తి, శివరాజు శ్రీనివాసరావు తో పాటు పలువురు ఉన్నారు.

## సామాజిక సేవ బాధ్యతల్లో "రిక్రియేషన్ క్లబ్"

**- అత్యుత్తమప్రతిభ చాటిన విద్యార్థులకు నగదు పురస్కారాలు**

**మధిర జూన్ 29 ప్రభాతవార్త:**

సాంస్కృతిక కళ ప్రచారాలతో పాటు సామాజిక సేవ కార్యక్రమాలలో తమ వంతు బాధ్యతమైన పాత్రను నిర్వహిస్తామని మధిర క్రియేషన్ క్లబ్ అధ్యక్షులు చావ రామకృష్ణ కార్యదర్శి గడ్డం శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం కళ్యాణమండపం కార్యాలయాన్ని చైర్మన్ చావా రామకృష్ణ లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మధిర ఎర్రుపాలెం మండలాల పరిధిలో ప్రభుత్వ పాఠశాలలు కళాశాలలో వివిధ అభ్యసించి విద్యనభ్యసించి అత్యుత్తమ మార్కులతో పాటు ట్రిబుల్ ఐటీ లలో సీట్లను సాధించిన విద్యార్థిని విద్యార్థులకు నగదు పురస్కారాన్ని కమిటీ ఆధ్వర్యంలో అందజేశారు. వీరిలోమధిర మండల ప్రథమ ద్వితీయ స్థానాలు సాధించిన మర్లపాడు ఉన్నత పాఠశాల విద్యార్థులు కుమారి నరేడ్ల లక్ష్మీ ్మ తిరుష, వడ్డెరపు ఉమాదేవిలతో పాటు ట్రిబుల్ ఐటీ బాసర లో సీటు సాధించిన కుమారి పోలారెడ్డి జీవిత రెడ్డి ని నగదు బహుమతులతో జ్ఞాపికల తో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు ముఖ్యులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతిభగల విద్యార్థులను ప్రోత్సహించడం, ఆర్థిక చేయూతనందించటం లో క్లబ్ సభ్యులు



ముందున్నారని అన్నారు. క్లబ్ ఎన్నో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహిస్తోందని భవిష్యత్తులో ఇంకా ఎన్నో కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు. మర్లపాడు హెచ్ఎం భీమరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల లోని ప్రతిభగల విద్యార్థులను అభినందించడం, నగదు బహుమతులతో సత్కరించడం వారికి ఎంతో స్ఫూర్తినిస్తుందని, ఇంత గొప్ప ఆలోచన చేసిన మధిర రీక్రియేషన్ క్లబ్ వారి సేవలను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో మడుపల్లి సీనియర్ ఉపాధ్యాయులు బూస కోటేశ్వరరావు, కోలగాని శ్రీనివాసరావు యరమలకోటారెడ్డి పలువురు ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు నరెడ్ల స్వాతి రామకృష్ణారెడ్డి వడ్డెరపు యశోద లు పాల్గొన్నారు.

## ఇండ్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

**- ఎంపీడీవో రమాదేవికి వినతిపత్రం అందజేత**

**బోనకల్, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని గోవిందపురం (ఎల్) గ్రామంలో ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ. గ్రామ సర్పంచ్ మందా కరుణ ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో ఆర్. రమాదేవి కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మందా కరుణ మాట్లాడుతూ, గ్రామంలో పలువురు కుటుంబాలు ఉన్నప్పటికీ ఒకే ఇంట్లో రెండు మూడు కుటుంబాలు ఇబ్బంది పడుతున్నారని తడికలు, తాత్కాలిక పట్టాలు కట్టుకొని నివసిస్తున్నారని తెలిపారు. వర్షాకాలంలో వారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతోందని, భారీ వర్షాలు కురిస్తే నివాసాలు కూలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అర్హులైన ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి



ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద పక్కా ఇళ్లు మంజూరు చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కారంగుల చంద్రయ్య, మాజీ ఎంపీటీసీ జొన్నలగడ్డ సునీత, వార్డు సభ్యులు ముత్తారపు రవి, షేక్ సైదా, ఏడునూతల లక్ష్మణరావు, తమ్మారపు లక్ష్మణ్, కళ్యాణపు కిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.




## వర్షాల నేపథ్యంలో రైతు ఆశీర్వాద సభ వాయిదా...

**- విలేకరుల సమావేశంలో భట్టి ,తుమ్మల వెల్లడి**

**చింతకాని ప్రభాత వార్త జూన్ 29:**



ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న రైతు సంక్షేమ, ప్రజా కార్యక్రమాలను మెచ్చి వరణ దేవుడు కరుణించాడని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు ఈనెల 30న చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభ సభా ప్రాంగణాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ లతో కలిసి డిప్యూటీ సీఎం సోమవారం పరిశీలించారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు, వర్షాల కారణంగా ఈ నెల 30న ఖమ్మం జిల్లా చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరకానున్న రైతు ఆశీర్వాద సభను వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు రైతులు, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అన్నారు వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో సభా ప్రాంగణం పూర్తిగా బురదమయంగా మారిందని, ప్రస్తుత పరిస్థితుల్లో లక్షలాది మంది రైతుల సమక్షంలో సభ నిర్వహించడం సాధ్యం కాదని తెలిపారురైతు సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్న ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం రైతుల సౌకర్యాన్ని దృష్టిలో పెట్టుకొని సభను వాయిదా వేస్తోందని పేర్కొన్నారు తొలుత ప్రారంభోత్సవ సభగా నిర్వహించాలని భావించిన ఈ కార్యక్రమాన్ని, ఇప్పుడు రైతు భరోసా పంపిణీ పూర్తయిన అనంతరం మరింత వైభవంగా ఖిరైతు ఆశీర్వాద సభఖి పేరుతో ముగింపు వేడుకగా నిర్వహిస్తామని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు వాతావరణ శాఖ నివేదికల ప్రకారం జిల్లాలో జూలై 3 లేదా 4వ తేదీ వరకు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని తెలిపారు రైతులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మరో వారం రోజుల వాతావరణ పరిస్థితులను సమీక్షి ంచి, పరిస్థితులు అనుకూలిస్తే జూలై 7 లేదా 8వ తేదీల్లో సభ నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వెల్లడించారు ఈ భారీ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు స్థానిక మంత్రులు, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికార యంత్రాంగం సమన్వయంతో ఏర్పాట్లు కొనసాగిస్తున్నట్లు తెలిపారు ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా రైతులు, ప్రజలు ఈ సభపై విశేష ఆసక్తి చూపుతున్నారని, వాతావరణం అనుకూలించిన వెంటనే నిర్వహించే రైతు ఆశీర్వాద సభ ప్రజలు ఊహించని స్థాయిలో విజయవంతం అవుతుందని డిప్యూటీ సీఎం విశ్వాసం వ్యక్తం చేశారు ఈ సందర్భంగా రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళీ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్షాల కారణంగా చింతకాని మండలంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొనాల్సిన రైతు ఆశీర్వాద సభను వాయిదా వేసినట్లు తెలిపారు రైతుల భద్రత, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు వర్షం అడ్డొచ్చినా రైతు సంక్షేమం ఆగదని, రైతు భరోసా నిధుల విడుదలకు సీఎం సిద్ధంగా ఉన్నారని,మంగళవారం హైదరాబాద్‌లోని శిల్పకళా వేదికలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు భరోసా పథకం నిధులను విడుదల చేస్తారని మంత్రి వెల్లడించారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేసే ప్రక్రియ ప్రారంభమవుతుందని తెలిపారు. రైతు భరోసా, రుణమాఫీ అంశాలపై ప్రతిపక్ష నాయకులు అర్థంపర్థం లేని విమర్శలు చేస్తున్నారని మంత్రి అన్నారు. గత ప్రభుత్వం పదేళ్లలో రైతు బంధు కింద రూ. 72 వేల కోట్లు అందించగా, ప్రజా ప్రభుత్వం కేవలం రెండున్నరేళ్లలోనే రైతు భరోసా ద్వారా రూ. 36 వేల కోట్ల సాయం అందించిందని అన్నారు యూరియా పంపిణీ కోసం రూపొందించిన యాప్ ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందుతూ ఉన్నాయని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ ప్రభుత్వం అన్ని రకాల పంటలను మద్దతు ధరకు కొనుగోలు చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

# సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి...

**- సంస్థను కాపాడుతున్న అధికారుల పట్ల నిరక్ష్య వైఖరి వీడాలి**

**- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**కొత్తగూడెం, జూన్ 29 ప్రభాతవార్త:** సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని, వారి పోరాటానికి తమ పూర్తి మద్దతు ఉంటుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు. అఖిల భారత బొగ్గుగనుల అధికారుల సంఘం (ఐఎంఓఏ) సింగరేణి శాఖ ఆధ్వర్యంలో కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట సోమవారం అధికారులు నిరసన దీక్ష చేపట్టారు. ఈ దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సందర్శించి వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాత్రింబవళ్లు శ్రమించి సింగరేణి సంస్థను లాభాల బాటలో నడిపిస్తున్న అధికారుల పట్ల యాజమాన్యం, ప్రభుత్వాలు నిరక్ష్య వైఖరి వీడాలన్నారు. అధికారుల పేరివిజన్, అలవెన్సులు, పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లాభాల్లో వాటా, మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత యాజమాన్యంపై ఉందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే స్పందించి అధికారుల సమస్యలపై చొరవ చూపాలని, లేనిపక్షంలో సిపిఐ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్, నాయకులు వంగ వెంకట్, జె గట్టయ్య,కిష్టాఫర్ తదితరులు పాల్గొన్నారు.

# బాలల సంరక్షణకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి...

**- ఆపరేషన్ ముస్కాన్-12 పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ**



**కొత్తగూడెం క్రైమ్, జూన్ 29 ప్రభాతవార్త:** జూలై 1వ తేదీ నుండి 31వ తేదీ వరకు నెల రోజులపాటు నిర్వహించనున్న ఆపరేషన్ ముస్కాన్-12 కార్యక్రమంపై సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, ఐపీఎస్ ఆధ్వర్యంలో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, స్త్రీ-శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, చైల్డ్ హెల్ప్‌లైన్-1098, కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ (కేఎస్‌సీఎఫ్), విద్యాశాఖ, వైద్యశాఖ, కార్మికశాఖ అధికారులతో పాటు ఇతర సంబంధిత విభాగాల ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆపరేషన్ ముస్కాన్-12 పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... గత 12 సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆపరేషన్ స్మైల్ మరియు ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశ్యం తప్పిపోయిన పిల్లలను గుర్తించడం, భిక్షాటనకు గురవుతున్న పిల్లలను రక్షించడం, నిరాదరణకు గురైన పిల్లలకు సంరక్షణ కల్పించడం, బాల కార్మికులను గుర్తించి రక్షించడం అని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా బాధిత పిల్లలను రక్షించి, అవసరమైన సంరక్షణ అనంతరం వారి కుటుంబాలకు అప్పగించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ ఏడాది ఆపరేషన్ ముస్కాన్-12 కార్యక్రమాన్ని జూలై 1 నుంచి జూలై 31 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. బాలల రక్షణ కోసం ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడిస్తూ, అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కొత్తగూడెం జిల్లా పరిధిలో 18 సంవత్సరాల లోపు పిల్లలను హింసించినా, భిక్షాటన చేయించినా, బాల కార్మికులుగా పనిచేయించినా సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ డీఎస్పీ మల్లేష్ స్వామి, జిల్లా సంక్షేమ అధికారి లెనినా స్వర్ణలత, డీసీపీవో హరికుమారి, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ రాము, అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్లు నాగరాజు, శాస్త్రి ఏసుపాదం, విద్యాశాఖ జిల్లా కోఆర్డినేటర్ సైదులు, కేఎస్‌సీఎఫ్ కోఆర్డినేటర్ రాజేష్, కమిటీ సభ్యులు, ఎస్ఐలు రమాదేవి, రాంబాబు, రామ్మూర్తి, రావూఫ్, వెంకన్న, సారంగపాణి, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# హెడ్ ఆఫీస్ ఎదుట రిలే నిరాహార దీక్షలు ప్రారంభం...



**కొత్తగూడెం, జూన్ 29 ప్రభాతవార్త:** సింగరేణి అధికారుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సీఎంఓఏఐ కార్పొరేట్ ఆధ్వర్యంలో నేడు సింగరేణి కార్పొరేట్ కార్యాలయం వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ ఉద్యమంలో ప్రధానంగా అధికారులు తమ డిమాండ్లను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లారు. సింగరేణి అధికారులకు తక్షణమే పే అప్గ్రేడషన్ అమలు చేయాలని, జీతాల అభివృద్ధితో పాటు భత్యాలపై పెర్ఫార్మన్స్ రిలేటెడ్ పే చెల్లింపులను వెంటనే అమలు చేయాలి. పారదర్శకమైన, న్యాయమైన పదోన్నతి విధానాన్ని అమలు చేసి అధికారుల కెరీర్ పురోగతికి అవకాశం కల్పించాలని, సింగరేణి అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న అధికారుల సమస్యలను యాజమాన్యం తక్షణమే పరిష్కరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సింగరేణి బ్రాంచ్ అధ్యక్షుడు టి. లక్ష్మీ మ్రపతి గౌడ్, కార్పొరేట్ అధ్యక్షులు ఎస్. వెంకటాచారి, డాక్టర్ కే. మాలతి, మాలోత్ రాంబాబు, తేజావత్ వీరన్న, కె. సర్వేశ్వరరావు పాల్గొని మాట్లాతుడు... పే అప్ గ్రేడేషన్ అనేది సింగరేణి అధికారుల అత్యంత కీలకమైన, న్యాయమైన డిమాండ్ అని, దీనిని ఇకపై ఆలస్యం చేయకుండా యాజమాన్యం వెంటనే అమలు చేయాలని కోరారు. అలాగే పిఆర్పి చెల్లింపులు, పారదర్శక పదోన్నతులు, అధికారుల సంక్షేమానికి సంబంధించిన అన్ని సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

## జిల్లాలో రాష్ట్ర పరిశీలక బృందం పరిశీలన



**కొత్తగూడెం, జూన్ 29 ప్రభాతవార్త:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహిస్తున్న పల్స్ పోలియో హౌస్‌టుహౌస్ సర్వే కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశీలక అధికారి బ్రహ్మానందరావు సోమవారం విస్తృతంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం పట్టణంలోని సఫాయి బస్తీ, బొల్లోరిగూడెం, పాల్వంచ ఆర్టీసీ బస్ స్టాండ్, అలాగే అల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గుత్తికోయ గిరిజన ఆవాసం ప్రాంతాల్లో హౌస్‌టుహౌస్ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇంటి ఇంటికి వెళ్లి ఐదేళ్లలోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించారా లేదా అనే విషయాన్ని యాదృచ్ఛికంగా తనిఖీ చేయడంతో పాటు, ఇళ్లపై చేసిన హౌస్ మార్కింగ్‌లు, సర్వే విధానం, బృందాల పనితీరును క్షుణ్ణంగా పరిశీలించారు. జిల్లాలో పల్స్ పోలియో కార్యక్రమం సమర్థవంతంగా నిర్వహించబడుతున్న తీరుపై రాష్ట్ర పరిశీలక అధికారి సంతృప్తి వ్యక్తం చేసి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి, జిల్లా శిశు ఆరోగ్య మరియు రోగనిరోధక టీకాల అధికారి డాక్టర్ ప్రతాప్, సీహెచ్‌వో నాగభూషణం, సీహెచ్‌వో సోమ్లా నాయక్, ఇతర ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




**చుంచుపల్లి, జూలూరుపాడు, సుజాతనగర్**

## నూతన జిల్లా పోలీస్ కార్యాలయ నిర్మాణ పనులను పరిశీలించిన ఎస్పీ

**కొత్తగూడెం క్రైమ్, జూన్ 29 ప్రభాతవార్త:**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ సమీపంలోని నవభారత్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న జిల్లా పోలీస్ కార్యాలయ భవనాన్ని, ఎస్పీ క్యాంప్ కార్యాలయాలను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు, ఇంజినీర్లతో మాట్లాడిన ఎస్పీ నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. భవనంలో ఏర్పాటు చేయనున్న కార్యాలయ గదులు, భద్రతా ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్బి 2 ఇన్స్పెక్టర్ బి. శ్రీనివాస్, ఆర్ అండ్ బీ శాఖ ఇంజినీర్లు పాల్గొన్నారు.

## యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో యాష్,బొగ్గు నిర్వహణ ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలి

**పాల్వంచ టౌన్,జూన్ 29,ప్రభాతవార్త:** యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని యాష్ నిర్వహణ కేంద్రం మరియు బొగ్గు నిర్వహణ కేంద్రం నిర్వహణను ప్రైవేట్ సంస్థలకు అప్పగించకుండా తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ ఆధ్వర్యంలోనే కొనసాగించాలని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ కమిటీ (టీఈఈజేఏసీ) ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సోమవారం కొత్తగూడెం థర్మల్ పవర్ స్టేషన్ సముదాయంలోని అంబేద్కర్ సెంటర్ వద్ద ఉద్యోగులు వారం రోజులుగా నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుత నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లోని కీలక విభాగాల నిర్వహణ ప్రభుత్వ రంగంలోనే కొనసాగితే సంస్థకు, ఉద్యోగులకు, స్థానిక ప్రజలకు మరింత ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. దేశంలోనే ప్రభుత్వ రంగంలోని అతిపెద్ద విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఒకటిగా నిలిచే యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌ను పూర్తిస్థాయిలో తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ సమర్థవంతంగా నిర్వహించే సామర్థ్యం ఉందని తెలిపారు. యాష్ నిర్వహణ కేంద్రం, బొగ్గు నిర్వహణ కేంద్రం నిర్వహణను కూడా ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యుత్ ఇంజినీర్ల సంఘం తరఫున ప్రవీణ్ కుమార్, బట్టు హరీష్, బి. రవి, రామకృష్ణ జాదవ్, సమీర్ అహ్మద్, కృష్ణయ్య, తెలంగాణ విద్యుత్ సహాయ ఇంజినీర్ల సంఘం తరఫున వంశీ, దూష సురేష్, తెలంగాణ డిప్లొమా విద్యుత్ ఇంజినీర్ల సంఘం తరఫున ఆర్. స్పందన, నాగరాజు, ఎస్. భాను మహేష్, బాల శ్రీనివాస్, తెలంగాణ రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం తరఫున వెంకటేశ్వర్లు, తెలంగాణ ముస్లిం ఉద్యోగుల సంక్షేమ సంఘం తరఫున మల్సూర్‌తో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో యాష్ నిర్వహణ కేంద్రం, బొగ్గు నిర్వహణ కేంద్రం నిర్వహణకు సంబంధించిన కాంట్రాక్టు ప్రక్రియను ప్రభుత్వం పునఃసమీక్షించి, ప్రజా ప్రయోజనాలు, ఉద్యోగుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించేలా నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ విద్యుత్ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ కమిటీ ప్రతినిధులు ప్రభుత్వాన్ని కోరారు.

## గోపిశెట్టి నాగేశ్వరరావుకు నివాళులు

**ఖమ్మం అర్బన్, జూన్ 29(ప్రభాతవార్త):**

ఖమ్మం నగరానికి చెందిన గోపిశెట్టి నాగేశ్వరరావు అకాల మరణంకు చింతిస్తూ వారి స్వగృహం లో చిత్ర పటానికి మున్నూరు కాపు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, జిల్లా కాంగ్రెస్ నాయకులు శెట్టి రంగారావు, మాజీ కార్పొరేటర్ రాపర్తి శరత్ కుమార్, నాళం సతీష్ తదితరులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులుగా రెండు పర్యాయాలు పనిచేసిన గోపీశెట్టితో సుదీర్ఘ అనుబంధాన్ని శెట్టి రంగారావు చేసుకున్నారు. అనంతరం వారి కుమారులు ప్రసాద్, అశోక్, సంతోష్ లతో మాట్లాడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియచేసారు.






## అంగన్వాడీ భవనానికి భూమిపూజ చేసిన సర్పంచ్ షేక్ సిద్దిక్

**రఘునాథపాలెం, ప్రభాతవార్త జూన్ 29:**

మండల కేంద్రం లోని పువ్వాడ నగర్ గ్రామం లో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరావు గారి దీవెనలతో గ్రామానికి మంజూరు అయినా నూతన అంగన్వాడీ భవనానికి గ్రామ సర్పంచ్ షేక్ సిద్దిక్ కొబ్బరికాయ కొట్టి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామం లో సీసీ రోడ్లు, అంగన్వాడీ భవనం, మరియు ఎన్నో అభివృద్ధి పనులు మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరావు గారి దీవెనల తో మంజూరు అయ్యాయి అన్నారు. ఈ కార్యక్రమం లో యుఉప సర్పంచ్ ఆదురి రాణి, వార్డ్ సభ్యులు శిరీష, రజిత, గ్రామ పెద్దలు, శివ, రఫి, బాబు లాల్, గురవయ్య, మల్లయ్య, ఇస్మాయిల్, రాములు, జనార్దన్, భూమయ్య, ప్రసాద్, వీరన్న, రామకృష్ణ, ఖాసీం, హుస్సేన్, తదితరులు పాల్గొని భావన నిర్మాణ పనులు ప్రారంభించారు.



## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ**

**- ప్రజావాణిలో ప్రజల అర్జీలు స్వీకరించిన అదనపు కలెక్టర్లు**



**ఖమ్మం, జూన్ 29, ప్రభాతవార్త :**

ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస్ రెడ్డితో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు. బోనకల్ మండలం ఆళ్లపాడు గ్రామానికి చెందిన ఎం. శ్రీను తనకు గతంలో దివ్యాంగుల పెన్షన్ వచ్చేదని, సదరం సర్టిఫికెట్ చేసినప్పటికీ ఆగిపోయిందని తనకు పెన్షన్ మళ్ళీ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం నగరం 44వ డివిజన్ లెనిన్ నగర్ కు చెందిన ఎస్.కే. నాజియా తన కూతురికి తలసేమియా వ్యాధి ఉందని సదరం క్యాంపు ద్వారా సర్టిఫికెట్ మంజూరు చేసి దివ్యాంగుల పెన్షన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పీడీ డీఆర్డిఓ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. ఏన్కూరు మండలం హిమాంనగర్ గ్రామ పంచాయతీ ప్రజలు, విద్యార్థుల తల్లి దండ్రులు గ్రామపంచాయతీ ప్రాథమికోన్నత పాఠశాల ఆక్రమణలను తొలగించి విద్యార్థుల సమస్య పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ రాస్తూ చట్టప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. కూసుమంచి మండలం కేశవాపురం గ్రామానికి చెందిన చాగంటి శ్రీదేవి తనకు సర్వే నెంబర్ 591/1/2 లో రెండు ఎకరాల భూమి ఉందని, దానిని అక్రమంగా సాగు చేసుకోనివ్వకుండా అడ్డుకోవడం జరుగుతుందని, ధరణిలో సర్వే నెంబర్ మిస్ మ్యాచ్ అయిందని, సమస్య పరిష్కరించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ కూసుమంచికి రాస్తూ చట్టప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ సిహెచ్ రామ్మూర్తి, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ కె. శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

## కమిషనరేట్‌లో ఇద్దరు ఏసీపీలకు పోస్టింగ్

**ఖమ్మం క్రైమ్ ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా భారీగా డిఎస్పీలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల సిఐల నుంచి డిఎస్పీలుగా పదోన్నతి పొందిన అధికారులు డీజీపీ కార్యాలయంలో వెయిటింగ్ లో ఉండగా వారిలో 28 మందికి నూతన పోస్టింగ్లు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీనిలో భాగంగా వెయిటింగ్ లో ఉన్న బీ హరినాథ్ బాబుకు ఖమ్మం సిటిసి కు, వెయిటింగ్ లో ఉన్న అడపా నరసింహారావుకు ఖమ్మం సీసీఆర్బి ఏసిపి గా పోస్టింగ్ లభించాయి. రాష్ట్రవ్యాప్తంగా మరి కొంత మంది డిఎస్పీలకు స్థానాచలం కలిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని డీఎస్పీ, ఏసీపీ ల స్థాన చలనం ఉన్నట్లు పోలీస్ శాఖలు చర్చ సాగుతోంది.

## గిరిజన నిరుద్యోగయువత ఉచిత నైపుణ్య శిక్షణకు దరఖాస్తు చేసుకోవాలి

**- జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు విజయలక్ష్మి**

**ఖమ్మం, జూన్ 29, ప్రభాతవార్త :**

సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ), భద్రాచలం ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా పరిధిలోని గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు 3 నుంచి 4 నెలల పాటు వివిధ రంగాల్లో ఉచిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఆసక్తి గల అర్హులైన గిరిజన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎన్. విజయలక్ష్మి ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీడీఏ స్కిల్ ట్రైనింగ్ సెంటర్, ఖమ్మంలో వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, బ్యూటీషియన్, గెస్ట్ సర్వీస్ అసోసియేట్ (ఫుడ్ అండ్ బేవరేజ్) లెవల్4, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సుల్లో శిక్షణ అందజేయనున్నట్లు తెలిపారు. వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్, గెస్ట్ సర్వీస్ అసోసియేట్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సులకు ఎస్ఎస్‌సీ లేదా అంతకంటే పై విద్యార్హత, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కోర్సుకు ఇంటర్మీడియట్, బ్యూటీషియన్ కోర్సుకు 8వ తరగతి లేదా అంతకంటే పై విద్యార్హత కలిగిన వారు అర్హులని తెలిపారు. వేర్‌హౌస్ ఎగ్జిక్యూటివ్, జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, గెస్ట్ సర్వీస్ అసోసియేట్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్ అసోసియేట్ కోర్సులకు 18 నుంచి 30 సంవత్సరాల వయస్సు, బ్యూటీషియన్ కోర్సుకు 18 నుంచి 35 సంవత్సరాల వయస్సు కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కోర్సు వ్యవధి 94 నుంచి 117 రోజుల వరకు ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణ సమయం లో ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, స్టడీ మెటీరియల్‌తో పాటు శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్ అందజేయబడు తుందని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, విద్యార్హతల ధృవ పత్రాలతో జూలై 1, 2026 ఉదయం 9 గంటలకు రోటరీ నగర్ (పోలీస్ స్టేషన్ ఎదురుగా, ఎస్‌బీఐ బ్యాంక్ పైన) ఉన్న ఐటీడీఏ స్కిల్ ట్రైనింగ్ సెంటర్, ఖమ్మంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 6305802724 నంబర్ నందు సంప్రదించాలని ఉప సంచాలకులు ఆ ప్రకటనలో తెలిపారు.

## ఎస్ఐఆర్ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలి

**- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి**

**- అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష**

**- హాజరైన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**




**ఖమ్మం , జూన్ 29, ప్రభాతవార్త:**

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియ గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించగా, కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పై. శ్రీజ, ఖమ్మం మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ, నిర్ణీత గడువులోగా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ పూర్తి చేయాలని అన్నారు. జిల్లాల వారీగా ఇప్పటివరకు పూర్తి చేసిన ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ వివరాలు సమీక్షించారు. బూత్ లెవెల్ అధికారులు (బీఎల్ఓలు) తప్పనిసరిగా ఇంటింటికీ వెళ్లి ఫారాలు అందివ్వాలని ఆదేశించారు . బీఎల్ఓ లు మాత్రమే ఫారాలు పంపిణీ చేయాలని స్పష్టం చేశారు. బీఎల్ఓ లు తప్పనిసరిగా టీ షర్ట్, క్యాప్, బ్యాగ్, ఐడీ కార్డులు ధరించాలని తెలిపారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై సందేహాలు నివృత్తి చేయడానికి ఖిహెల్ప్ డెస్క్ఖి లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. ఎన్యుమరేషన్ యాప్ వినియోగించేందుకు అధికారం కేవలం బీఎల్ఓ లకు మాత్రమే ఉందని స్పష్టం చేశారు. ప్రజలకు ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు. మీడియా, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారం కల్పించాలని పేర్కొన్నారు. ఓటర్ల నుంచి తప్పనిసరిగా ఎన్యూమరేషన్ ఫారాలు తిరిగి తీసుకోవాలని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఎన్నికల విభాగం డిటి అన్సారీ, అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ పాఠశాలకు తాళం వేసిన కాంట్రాక్టర్

**ఖమ్మం విద్యా విభాగం జూన్ 29, ప్రభాతవార్త:** ఖమ్మం నగర పరిధిలోని ధనవాయిగూడెం ప్రభుత్వ పాఠశాలకు ఓ కాంట్రాక్టర్ తాళం వేశారు. పాఠశాలకు చేసిన అభివృద్ధి పనులకు రావాల్సిన 13 లక్షల రూపాయలు బిల్లుల రూపంలో తనకు రావాల్సి ఉందని, ఎన్నిసార్లు అధికారుల చుట్టూ తిరిగిన ప్రయోజనం లేకపోవడంతో చేసేదిలేక తన కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం ఉదయం పాఠశాలకు తాళం వేశాడు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులను సమీపంలోని అంగన్వాడి కేంద్రంలో ఉంచారు. ఈ ఘటన విద్యాశాఖలో తీవ్ర చర్చకు దారి తీసింది . ప్రభుత్వ ఉన్నతాధికారులు నిరక్ష ్య కారణంగా ఇటువంటి ఘటనలు చోటు చేసుకోవడం విశేషం.

# రైతుల భూములను నిషేధిత జాబితా నుండి తొలగించాలి

**- అసంపూర్తి డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్తి చేయాలి**

**- బ్లాస్టింగ్‌లో దెబ్బతిన్న ఇళ్లకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి**

**- జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందచేసిన సర్పంచ్ మర్రి సంధ్య**





**అశ్వాపురం,ప్రభాతవార్త,జూన్ 29:** మొండికుంట గ్రామపంచాయతీలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలపై మొండికుంట గ్రామ పంచాయతీ సర్పంచ్ మర్రి సంధ్య కలెక్టరేట్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ అంకిత్ కు పలు సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మర్రి సంధ్య మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార మార్గమైన ప్రజావాణి లో అనేక సంవత్సరాలుగా పరిష్కారం కానీ గ్రామపంచాయతీలోని సమస్యలపై జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేశామని తెలిపారు.ఎన్నో సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతుల భూముల సర్వే నెంబర్లు 190,997,450,433 నిషేధిత జాబితా నుంచి తొలగించాలని,మొండికుంట మెయిన్ రోడ్డు డ్రైనేజీ అసంపూర్తిగా నిర్మాణం తో మిగిలిపోయిందని, ఈ కారణంగా ప్రజలు దూరమైన ఇబ్బందులు పడుతున్నారని, ఈ అసంపూర్తి డ్రైనేజీ నిర్మాణాన్ని పూర్తి చేయాలని, అర్ధాంతరంగా ఆగిపోయిన బి జి కొత్తూర్ బీటీ రోడ్డు పూర్తి చేయాలని మరియు బిజీ కొత్తూరు గ్రామంలో సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణంలో భాగంగా జరిగిన బ్లాస్టింగ్ కు గ్రామంలో ఇల్లు దెబ్బతిన్నాయని,ధ్వంసమైన ఇండ్లకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని, ఇంకా గ్రామంలోని మరికొన్ని సమస్యలపై కలెక్టర్ కు వినతి పత్రం అందజేసినట్టు వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చలమల్ల శివారెడ్డి మాజీ సర్పంచ్ మర్రి మల్లారెడ్డి,బీఆర్ఎస్ యువజన నాయకులు పసుల శివ,శ్రీను,తదితరులు పాల్గొన్నారు.




# మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి రూ.50 లక్షల నిధులు మంజూరు

**- పినపాక ఎమ్మెల్యే ఎమ్మెల్యే పాయంను కలిసిన అస్పత్రి వైద్యులు**

**మణుగూరు, ప్రభాతవార్త, జూన్ 29:**



మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి పనుల కోసం రూ.50 లక్షల రూపాయల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులు మంజూరు చేయించినందుకు కృతజ్ఞతగా ఆసుపత్రి వైద్య సిబ్బంది పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లును మణుగూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల బలోపేతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ఈ నిధులతో ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, ప్రజలకు మరింత మెరుగైన, నాణ్యమైన ఆరోగ్య సేవలు అందుబాటులోకి వచ్చేలా కృషి చేస్తామన్నారు. ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపిన వారిలో ఏరియా హాస్పిటల్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ గౌరీ ప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ పి. క్రాంతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# మణుగూరు ఏరియాలో సింగరేణి అధికారుల రిలే నిరాహార దీక్షలు

**- సంపూర్ణ మద్దతు ప్రకటించిన యూనియన్లు**

**మణుగూరు, ప్రభాతవార్త, జూన్ 29:**

సింగరేణి అధికారులకు కోల్ ఇండియా తరహాలో ఖీపే అప్‌గ్రేడేషన్‌ఖీ అమలు చేయాలని, గత రెండేళ్ల ప్రొడక్షన్ రిలేటెడ్ పే (పీఆర్‌పీ)ని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎంవోఏఐ) ఆధ్వర్యంలో సింగరేణి సంస్థ మణుగూరు ఏరియా అధికారులు సోమవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ దీక్షలు జూలై 13వ తేదీ వరకు కొనసాగుతాయని, యాజమాన్యం స్పందించకుంటే తీవ్రమైన పోరాటాలకు వెనకాడబోమని అధికారులు హెచ్చరించారు. ఈ మొదటిరోజు దీక్షల్లో సంఘం ముఖ్య కార్యదర్శి మదన్ నాయక్, రమణారెడ్డి, రామ్ శంకర్, శోభన్ బాబు, సాయిల సురేష్ కుమార్, సర్వర్ నభి, కిషన్ రామ్, తోలం మధుసూదన్, డి. రమేష్ బాబు, సుదర్శన్ రెడ్డి, సీతారాం బాబు, జె. శ్రీనివాసరావు, నరసింహారావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.





**- సంపూర్ణ మద్దతు...**

ససింగరేణి సంస్థ మణుగూరు ఏరియాలో కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (సీఎం వోఏఐ )ఆధ్వర్యంలో సోమవారం మణుగూరు ఏరియా అధికారులు తమ న్యాయమైన కోర్కెల సాధన కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు ఏరియా ఏఐటీయూసీ, ఐఎన్టీయూసీ, టీబీజీకేఎస్ యూనియన్స్ సంపూర్ణ మద్దతు ప్రకటించి ఈ సందర్భంగా వై. రాంగోపాల్, వి. కృష్ణంరాజు, వి. ప్రభాకర్ రావు లు మాట్లాడుతూ.. సింగరేణి అధికారులు ఎదుర్కొంటున్న సమస్యలను యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మణుగూరులో రూ.65 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ

**మణుగూరు, ప్రభాతవార్త, జూన్ 29:**





మణుగూరు మండలంలో పలు అభివృద్ధి పనులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం భూమిపూజ చేసి ప్రారంభించారు. తొలుత మణుగూరు మున్సిపాలిటీ పరిధిలోని శేషగిరి నగర్‌లో రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్, సీసీ రోడ్డు పనులకు ఆయన శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.స్థానిక ప్రజల మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ ధ్యేయమని, ఈ పనులతో కాలనీవాసులకు ఎంతో సౌకర్యం కలుగుతుందని పేర్కొన్నారు. అనంతరం, మణుగూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేసి ఆసుపత్రిలోని పలు విభాగాలను పరిశీలించి, రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించడానికే ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తున్నట్లు ఆయన తెలిపారు. అన్ని పనులను నిర్ణీత గడువులోగా, నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ పార్టీ మండల, టౌన్ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, ఆసుపత్రి సూపరింటెండెంట్, వైద్యులు, పాల్గొన్నారు.

# సైన్స్ ల్యాబ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం

**మణుగూరు, ప్రభాతవార్త, జూన్ 29:**

మణుగూరు మండలం లోని లంక మల్లారం గ్రామంలోని తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో రూ.13.50 లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేసిన సైన్స్ ల్యాబ్‌ను పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక ప్రయోగశాలల ద్వారా గ్రామీణ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం, పరిశోధనా నైపుణ్యాలు పెంపొందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ ల్యాబ్ ద్వారా విద్యార్థినులు ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని పెంపొందించుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎమ్మెల్యే పాయం విద్యార్థినులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. భోజన నాణ్యత, మెనూ, హాస్టల్ వసతులపై విద్యార్థినులు, కళాశాల సిబ్బందిని అడిగి తెలుసుకున్న ఆయన, విద్యార్థినులకు నిరంతరం మెరుగైన వసతులు, నాణ్యమైన విద్య అందేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాణి, అధ్యాపకులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



# బీటీపీఎస్‌లో జేఏసీ ఆందోళ

**మణుగూరు, ప్రభాతవార్త, జూన్ 29:** వైటీపీఎస్ లోని స్టేజ్1, స్టేజ్2 కోల్, యాష్ ప్లాంట్ల ప్రైవేటీకరణ ప్రతిపాదనలను నిరసిస్తూ తెలంగాణ పవర్ ఎంప్లాయిస్ జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం బీటీపీఎస్ ప్రధాన గేటు ఎదుట ఖీగేట్ మీటింగ్ఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులు ఇంత పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తున్నా యాజమాన్యం పునరాలోచన చేయడం లేదని విమర్శించారు. టెండర్లను రద్దు చేసేంత వరకు ఆందోళనలు కొనసాగుతాయని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో



టీఎస్ఈఏఈఏ బ్రాంచ్ సెక్రటరీ నరేష్, నాయకులు మహేష్, కార్మిక సంఘం (1535) అధ్యక్షులు వి. ప్రసాద్, కార్మిక సంఘం (327) నాయకులు కొండలరావు, ఏటీసీ నాయకులు ఆర్. రవిచంద్ర పాల్గొన్నారు.

# ఏజెన్సీ చట్టాలకు పాతర.. మాంటిస్సోరీపై ప్రజావాణిలో ఫిర్యాదు

- యూపీఎస్ స్కూల్‌కు 200 మీటర్ల దూరంలోనే ప్రైవేట్ స్కూల్
- ఆటస్థలం లేదు.. నిబంధనలు లేవు.. ఫీజుల దోపిడీపై మండిపాటు
- ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు
- తక్షణమే సీజ్ చేయాలని డిమాండ్ చేసిన సేవాలాల్ సేన నాయకులు



**టేకులపల్లి, ప్రభాతవార్త:** గిరిజన ప్రాంతాల రక్షణ కోసం ఉద్దేశించిన ఏజెన్సీ చట్టాలను, విద్యాశాఖ నిబంధనలను పూర్తిగా తుంగలో తొక్కుతూ టేకులపల్లి మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ మాంటిస్సోరీ పాఠశాల వైఖరిపై సేవాలాల్ సేన జిల్లా కమిటీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జాయింట్ కలెక్టర్ (జేసీ)కి సేవాలాల్ సేన జిల్లా కార్యదర్శి బాదావత్ సురేష్ నాయక్ ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా సేవాలాల్ సేన ప్రతినిధులు మాట్లాడుతూ, గిరిజనేతర యజమాని ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ పాఠశాలకు కేవలం జిల్లా విద్యాశాఖ అధికారి ( డి ఈ ఓ ) నుండి మాత్రమే అనుమతి ఉందని, మిగిలిన ఏ ఒక్క ప్రభుత్వ శాఖ నుండి కూడా చట్టబద్ధమైన పర్మిషన్లు లేవని ధ్వజమెత్తారు. ప్రభుత్వ పాఠశాలలను దెబ్బతీసేలా, స్థానిక టేకులపల్లి యూపీఎస్ పాఠశాలకు కేవలం 200 మీటర్ల దూరంలోనే ఈ ప్రైవేట్ పాఠశాల ఏర్పాటు చేయడం అధికారుల బేఖాతరుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. విద్యార్థులకు కనీస ఆటస్థలం ( ప్లే గ్రౌండ్ ) కూడా లేని ఈ పాఠశాలకు అధికారులు ఎలా అనుమతులు మంజూరు చేశారని ప్రశ్నించారు. చట్టాలను పక్కనబెట్టి, నిరుపేద తల్లిదండ్రుల నుండి ఫీజుల రూపంలో భారీగా దోపిడీ చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనేతరులు భూములు లీజుకు తీసుకోవడం లేదా వ్యాపారాలు చేయడంపై ఉన్న చట్టపరమైన 1/70 అనుమతులు ఈ పాఠశాలకు లేవు కనీస ఆటస్థలం లేదు. ప్రభుత్వ పాఠశాలకు 200 మీటర్ల లోపే నిర్మిస్తూ విద్యాశాఖ నిబంధనలను ఉల్లంఘించారు. ప్రమాదాలు జరిగితే పిల్లల రక్షణ కోసం ఉండాల్సిన ఫైర్ డిపార్ట్‌మెంట్ (ఎన్ ఓ సి)కానీ, భవన దృఢత్వానికి సంబంధించిన ళి తీ ఫిట్‌నెస్ సర్టిఫికేట్ కానీ లేవు. గ్రామ పంచాయతీ ఎన్ ఓ సి తో పాటు, పాఠశాలలో తాగునీరు, పరిశుభ్రతపై సానిటేషన్ హెల్త్ సర్టిఫికేట్ ఖచ్చితంగా ఉండాలి. ఈ కనీస అనుమతులు, సౌకర్యాలు ఏవీ లేకుండా, కేవలం విద్యాశాఖ లూప్‌హోల్స్‌తో ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘిస్తూ పాఠశాల నడపడం గిరిజన హక్కులను అవమానించడమేనని నేతలు మండిపడ్డారు. విద్యార్థుల ప్రాణాలతో ఆడుకుంటూ, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ఈ మాంటిస్సోరీ విద్యాసంస్థపై ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి ఉన్నత స్థాయి విచారణ జరపాలని, నిబంధనల ప్రకారం స్కూల్‌ను సీజ్ చేయాలని జేసీని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో సేవాలాల్ సేన ఆధ్వర్యంలో గిరిజన సంఘాలను, తల్లిదండ్రులను ఏకం చేసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సేవాలాల్ సేన టేకులపల్లి మండల అధ్యక్షులు భానోత్ కిషన్ నాయక్, నాయకులు పవన్ కళ్యాణ్ నాయక్, నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు పరిరక్షణకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలి

- ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొన్న టీడీపీ నేత ముద్రగడ వంశీ, సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు



**ఇల్లందు అర్బన్, జోన్ 29, ప్రభాతవార్త:**

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో ప్రతి ఓటరు తప్పనిసరిగా పాల్గొని తమ ఓటు వివరాలను ధ్రువీకరించుకోవాలని టీడీపీ ఇల్లందు నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ వంశీ, విజయలక్ష్మీ నగర్ సర్పంచ్ చాందావత్ రమేష్ బాబు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బీఎల్‌వోలు ఇంటింటికీ వచ్చి ప్రతి ఓటరికి ఫారాలు అందజేస్తారని, వాటిలో పూర్తి వివరాలు నమోదు చేసి ఫొటో అతికించి తిరిగి బీఎల్‌వోలకు అందించాలని సూచించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం అత్యంత ముఖ్యమని, ఇందులో బీఎల్‌వోలు, బీఎల్‌ఏల పాత్ర కీలకమని తెలిపారు. నియోజకవర్గంలో బోగస్ ఓట్ల తొలగింపు, మరణించినవారు, వలస వెళ్లిన వారి ఓట్లను గుర్తించి తొలగించడం, అర్హత కలిగిన కొత్త యువ ఓటర్ల పేర్లను నమోదు చేయడం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ప్రతి ఓటరు పేరుపై వచ్చిన ఫారాన్ని తప్పనిసరిగా తిరిగి సమర్పించాలని, వివరాలు నమోదు చేసే సమయంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఏవైనా సందేహాలు ఉంటే బీఎల్‌వో, బీఎల్‌ఏ లేదా సర్పంచ్‌ను సంప్రదించాలని తెలిపారు. 2002 తర్వాత వివాహం చేసుకుని గ్రామానికి వచ్చిన మహిళలు తమ తల్లిదండ్రులు లేదా తాతల ఓటరు వివరాలను సేకరించి నమోదు చేసుకోవాలని సూచించారు. నెల రోజుల పాటు సాగే ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌వో ధనసరి వంశీ, వార్డు సభ్యులు అజయ్, భద్రు, వసంత, గ్రామస్థులు విజయ్, నాని, రాజేష్, శ్రీనివాస్, అనిల్, శ్రీను, బాలా, శంకర్, దివ్య, కవిత, స్వప్న, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ప్రాధాన్యం

- వార్డుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి
- పురపాలక సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదేశాలు

**ఇల్లందు, జూన్ 29, ప్రభాతవార్త:**

ఇల్లందు పురపాలక ప్రజలకు ఎలాంటి మౌలిక వసతుల ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా తాగునీటి సమస్యకు తావులేకుండా చూడడంతో పాటు వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అధికారులను ఆదేశించారు. పురపాలక చైర్మన్ దొడ్డా కిరణ్ మిత్ర డానియల్ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన పురపాలక సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సమావేశంలో పట్టణంలోని మౌలిక వసతులు, తాగునీటి సరఫరా, పారిశుద్ధం, డ్రైనేజీ, వీధి దీపాలు, రహదారుల అభివృద్ధి, వర్షాకాలంలో వ్యాపించే సీజనల్ వ్యాధుల నివారణ చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ప్రతి సమస్యను సంబంధిత అధికారులు అత్యవసరంగా పరిశీలించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే కనకయ్య స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించడంలో అధికారులు నిరక్ష్యం ప్రదర్శించవద్దని సూచించారు. ఈ సమావేశంలో పురపాలక వైస్ చైర్మన్ పెండేల రాజు, పురపాలక కమిషనర్ సందీప్, కౌన్సిలర్లు సైది మియా, అజ్మీర వంశీ, ఖుష్బూ మునావర్, చిల్లా విజయభారతి, రాధ కమల్ కోరి, గోపగాని రాజు, రేఖ స్వరూప్ రవిశంకర్, గందె పద్మ సదానందం, మేరుగు కార్తీక్, రంప రమ్య, దండు సారయ్య, నీరుడు ఉపేంద్ర, సోని భాయ్ కోరి, పాబోలు స్వాతి, పింగళి అనూహ్య, మహ్మద్ జాఫర్, నీలపు రమేష్, కొర్లపాటి శివకిరణ్, చెనిగరపు శృతి, కో ఆప్షన్ సభ్యులు మడుగు సాంబమూర్తి, పర్రె స్వర్ణలత, అజాం, హసీనా, అలాగే పురపాలకంలోని అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.




## బోడు ఎస్సైగా రాజమోళి బాధ్యతలు

**టేకులపల్లి, ప్రభాతవార్త:**




టేకులపల్లి మండలం బోడు పోలీస్ స్టేషన్ నూతన ఎస్సైగా ఎం రాజమోళి బాధ్యతలు చేపట్టారు ఇక్కడ పనిచేసిన శ్రీనివాస్ రెడ్డి బదిలీ కావడంతో రాజమోళి బాధ్యతలు చేపట్టారు ఈ సందర్భంగా పిఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




ఇల్లెందు, గుండాల, టేకులపల్లి

## తుడుం దెబ్బ ఉద్యమ సీనియర్ నేత పూణెం రామనాథం మృతి

- ఆదివాసీ ఉద్యమాలకు తీరని లోటని తుడుం దెబ్బ నివాళి

**ఇల్లందు అర్బన్, జూన్ 29, ప్రభాతవార్త:**



ఇల్లందు మండలం మామిడిగూడెం గ్రామానికి చెందిన తుడుం దెబ్బ ఉద్యమ సీనియర్ నాయకుడు పూణెం రామనాథం ఆదివారం ఉదయం అకాల మరణం చెందారు. ఆయన మృతి పట్ల ఆదివాసీ హక్కుల పోరాట సమితి, తుడుం దెబ్బ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ప్రగాఢ సంతాపం తెలిపారు. పూణెం రామనాథం ఇల్లందు నియోజకవర్గంలో తుడుం దెబ్బ ఆధ్వర్యంలో నిర్వహించిన అనేక ప్రత్యక్ష ప్రజా ఉద్యమాల్లో క్రియాశీలకంగా పాల్గొన్నారు. ఆదివాసీల పోడు భూముల హక్కులు, గ్రామాల్లో పాఠశాలలు, మంచినీటి సౌకర్యం, రహదారులు తదితర మౌలిక వసతుల కల్పన కోసం నిరంతరం పోరాటం చేశారు. ఆదివాసీ ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసిన ఉద్యమ నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు. పూణెం రామనాథం అకాల మరణం ఆదివాసీ సమాజానికి, తుడుం దెబ్బ ఉద్యమానికి తీరని లోటని నాయకులు పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ప్రజా ఉద్యమాల్లో ఆయన చేసిన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా తుడుం దెబ్బ నాయకులు పూణెం రామనాథంకు విప్లవ జోహార్లు అర్పిస్తూ, ఆయన ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే సమ్మె తప్పదు

- సింగరేణిలో రాజకీయ జోక్యం పెరిగిందని ఏఐటీయూసీ నేత కె. సారయ్య విమర్శ

**ఇల్లందు అర్బన్, జూన్ 29, ప్రభాతవార్త :**

ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఇల్లందు బ్రాంచ్ కార్యవర్గ సభ్యుల సమావేశం బానోత్ బాలాజీ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కె. సారయ్య మాట్లాడుతూ సింగరేణిలో కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకపోతే సమ్మెకు వెళ్లడం అనివార్యమవుతుందని హెచ్చరించారు. డిపెండెంట్ ఉద్యోగాలను కొత్త ఉద్యోగాలుగా ప్రచారం చేయడం కార్మికులను తప్పుదోవ పట్టించడమేనని ఆయన అన్నారు. అనారోగ్యం లేదా ఉద్యోగి మరణం నేపథ్యంలో ఇచ్చే డిపెండెంట్ ఉద్యోగాలు కార్మికుల హక్కేనని, వాటిని ప్రభుత్వం కల్పించిన కొత్త ఉద్యోగాలుగా చూపించడం సరికాదన్నారు. ఖరీదైన కార్లు, ఖద్దర్ దుస్తులతో వచ్చి కార్మికులను మభ్యపెట్టే ప్రయత్నాలు మానుకోవాలని, అసత్య ప్రచారాలతో సింగరేణి కార్మికులను తప్పుదోవ పట్టిస్తే సహించబోమని హెచ్చరించారు. కార్మికుల హక్కులపై రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు. సింగరేణి కార్మికుల 11వ వేతన ఒప్పందం గడువు జూన్ 30తో ముగుస్తున్నందున వెంటనే 12వ వేతన చర్చల కమిటీని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కొత్త లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం జూలై 1న అన్ని గనుల్లో జేఏసీ ఆధ్వర్యంలో కార్మికులు నల్ల బ్యాడ్జీలు ధరించి యాజమాన్యానికి వినతిపత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. అదే రోజు కొత్తగూడెంలోని సింగరేణి ప్రధాన కార్యాలయం ఎదుట భారీ ధర్నా నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమాలకు కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో బ్రాంచ్ కార్యదర్శి ఎండీ నజీర్ అహ్మద్, బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బానోత్ బాలాజీ, నాదెండ్ల శ్రీనివాస్ రెడ్డి, వి. జయరాజ్, గుగులోత్ కృష్ణ, దాట్ల వెంకటేశ్వర్లు, బొల్లెద్దుల శ్రీనివాస్, అజ్మీరా కిషోర్, టి. వెంకటేశ్వరరావు, షేక్ హుస్సేన్, చిక్కా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఆటో చోరీకి పాల్పడిన వ్యక్తి అరెస్ట్

**అశ్వారావుపేట రూరల్, జూన్ 29 ప్రభాతవార్త:**



ఓ ఫంక్షన్ హాల్ ముందు పార్క్‌చేసి ఉంచిన ఆటోను చోరీకి పాల్పడిన వ్యక్తిని పోలీస్‌లు సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసు వారివివరాల ప్రకారం. జూన్ 23న పట్టణంలోని శ్రీ శ్రీ ఫంక్షన్ హాల్ ఎదురుగా రోడ్డు పక్కన పార్క్ చేసి ఉన్న తిశి ఆటోను దొంగలించారని అన్నపురెడ్డిపల్లి మండలం అబ్బుగూడెంకు చెందిన మహంకాళి వెంకటేష్ పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు ఎసఐ యయాతి రాజు కేసు నమోదు చేశారు. దర్యాప్తు లో భాగంగా ఆటో దొంగతనం చేసిన సత్తుపల్లికి చెందిన ఎస్‌కె రహీమ్‌ను పోలీస్‌లు పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి ఆటోని స్వాధీన పరచుకుని రిమాండ్ కు తరలించినట్లు సిఐ నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎసఐ యయతాతి రాజు, అదనపు ఎసఐ దేవ్‌సింగ్, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి తుమ్మలను కలిసిన మండల రైతులు

**దమ్మపేట, జూన్ 29 ప్రభాతవార్త:**



దశాబ్దాలుగా సాగు చేసుకుంటున్న తమ భూములను ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, తమకు న్యాయం చేయాలని దమ్మపేట రెవెన్యూ మోజాలోని సర్వే నెం 273/1 లో బాధిత రైతులు సోమవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును మండలంలోని గండుగులపల్లి గ్రామంలో కలిసి విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమ గోడును మంత్రికి వివరించారు. రైతుల గోడు విన్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సానుకూలంగా స్పందించారు. ఆ నాడు నిరుపేదలకు పంపిణీ చేసిన భూములపై రైతులకే పూర్తి హక్కు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. కబ్జాదారుల బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదని, ఎప్పటిలాగే రైతులు తమ భూముల్లో ధైర్యంగా సాగు చేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ సమస్య పరిష్కారం కోసం తాను జిల్లా కలెక్టర్‌తో స్వయంగా మాట్లాడతానని, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ దృష్టికి కూడా ఈ విషయాన్ని తీసుకెళ్లాలని రైతులకు మంత్రి సూచించారు . రాష్ట్ర మంత్రి తమకు అండగా నిలవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రావు గంగాధరరావు , కొయ్యల అచ్యుతరావు. రైతులు తదితరులు పాల్గొన్నారు.

## 4వ వార్డు కౌన్సిలర్ ఔదార్యం

**అశ్వారావుపేట అర్బన్, జూన్ 29 ప్రభాతవార్త:**

అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డ్ కౌన్సిలర్ కట్టా సింధుజ తన ఔదార్యాన్ని చాటుకున్నారు. సోమవారం 4వ వార్డ్ లోని మండల ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు స్టాండ్ ఫ్యాన్ వితరణగా అందించారు. గత మూడు నెలలుగా వేసవితాపంతో పాటు ఉక్క పోత తో అతలాకుతలం అవుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వర్షాలు



కురవకపోవడంతో ఉక్కపోతతో పాఠశాలలోని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పాఠశాల హెచఎం వలపర్ల బాబురావు సూచన మేరకు విద్యార్థులకు చల్లదనాన్ని అందించే స్టాండ్ ఫ్యాన్ వితరణగాఅందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు నాలుగో వార్డుసభ్యులు కట్టా రాంబాబు, కట్టా నీరజ, ఆరేపల్లి దుర్గా నాగేశ్వరరావు, మోర్ల వెంకన్న, రజియా బేగం, ఉపాధ్యాయురాలు కావ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



**కారేపల్లి జూన్ 29 ప్రభాతవార్త**

అప్పాయిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని భిక్య తండా గ్రామంలో అనారోగ్యంతో మరణించిన అజ్మీరా ఈరి భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాలకవర్గ సభ్యులు బాధిత కుటుంబానికి 5000 రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, "ఈ క్లిష్ట సమయంలో అజ్మీరా ఈరి కుటుంబానికి గ్రామ పంచాయతీ తరఫున అండగా ఉంటాం. కుటుంబ సభ్యులు ధైర్యంగా, మనోధైర్యంతో ఈ కష్టాన్ని ఎదుర్కోవాలని కోరుకుంటున్నాం. అన్నారు. భగవంతుడు మృతుని ఆత్మకు శాంతి చేకూర్చాలని, వారి కుటుంబ సభ్యులకు ఈ విషాదాన్ని భరించే శక్తిని ప్రసాదించాలని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దండు ప్రవీణ్ ఉప సర్పంచ్ ఎట్టి సంధ్య రాణి వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా ఎన్నో ప్రయోజనాలు



**కారేపల్లి 29 జూన్ 29 ప్రభాతవార్త**

రైతు ఉత్పత్తిదారుల సంస్థ (ఎఫ్.పీ.వో) ద్వారా రైతులకు ఎన్నో ప్రయోజనాలు సమకూరుతాయని అధునిక వ్యవసాయ పద్ధతుల తెలుసుకోవడంతోపాటు రైతులు తప్పనిసరిగా సభ్యులుగా చేరాలని కారేపల్లి సొసైటీ చైర్మన్ శ్రీ దుగ్గినేని శ్రీనివాసరావు, ఎఫ్.పీ.వో డొమైన్ ఎక్స్ పర్ట్ చావా అరుంధతి లు అన్నారు. సహకార వారోత్సవాలలో భాగంగా రైతు ఉత్తత్తిదారుల సంస్థ, కారేపల్లి సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వారు మాట్లాడుతూ రైతులకు అధునిక వ్యవసాయ పద్ధతులు పరిచయం చేయటానికి రైతు ఉత్పత్తిదారుల సంస్థ (నీశివీ) ను ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎఫ్ పీవో లో రూ.2 వేలు కట్టి సభ్యత్వం చేరిన రైతులకు అనేక లాభాలు ఉన్నాయన్నారు. రూ. 2వేలు కట్టి సభ్యత్వం చేరిన రైతులకు కేంద్ర ప్రభుత్వం మరో రూ.2వేల అందజేస్తుందని తెలిపారు. 750 మంది సభ్యులుగా చేరే అవకాశం ఉందని 750 మంది రూ.2వేలు చొప్పున రూ.15 లక్షలు కట్టితే కేంద్ర ప్రభుత్వం మరో రూ. 15 లక్షలు ఇస్తుందని




దీంతో 30 లక్షలతో ఎఫ్.పీ.వో ద్వారా రైతులకు అవసరమైన అధునిక పరికరాలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచవచ్చన్నారు. రైతులకు పురుగుమందులు పిచికారి చేయటానికి డ్రోన్, హార్వెస్టర్, ట్రాక్టర్ పరికరాలు తక్కువ ధరలో కిరాయి ఇవ్వటం చేయటం ద్వారా రైతు ఉత్పత్తిదారుల సంస్థకు ఆర్థికంగా బలోపేతం అవుతుందన్నారు. వచ్చిన లాభాల పైకంలో సభ్యులుగా ఉన్న వారికి పంచటం జరుగుతుందని తెలిపారు. రైతు ఉత్పత్తిదారుల సంస్థ ద్వారా పెద్ద పరిశ్రమలు సైతం స్థాపించవచ్చని దానికి కేంద్రప్రభుత్వం 7 శాతం వడ్డీకి రుణ సౌకర్యం మరియు 50శాతం సబ్సీడీ సైతం అందజేస్తుందని తెలిపారు. రైతులు తప్పని సరిగా ఎఫ్.పీ.వో ను వినియోగించుకోవాలని దానికి రూ.2వేలు కట్టి సభ్యులుగా చేరాలని సంస్థ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి బొల్లు హనుమంతరావు, డైరక్టర్లు అడ్డగొడ ఐలయ్య, మర్సకట్ల రోషయ్య, డేగల ఉపేందర్, టేకులగూడెం సర్పంచ్ గుమ్మడి సందీఫ్, ఉపసర్పంచ్ నాగేశ్వరరావు లు పాల్గొన్నారు.




## కలుపు మందు పిచికారి

**దమ్మపేట రూరల్ జూన్ 29 ప్రభాతవార్త**

:మండల కేంద్రంలోని రోడ్డు కు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు పెరిగి విపరీతమైన దోమలు పెరగడంతో ప్రజల ఫిర్యాదు మేరకు దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు, వార్డు సభ్యులతో కలిసి కలుపు మందు పిచికారి మోడల్ కాలనీ లో ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో డ్రైనేజీలలో, చెత్త వెయ్యొద్దని, ఇంటి ముందు చెత్తను శుభ్రం చేసుకోవాలని తద్వారా దోమలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఆంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్, రూప రాంబాబు, గోళ్ళభవాని, చిన్న శెట్టి నాగలక్ష్మి, ముక్తేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన విద్యుత్ సరఫరాకుఅత్యంత ప్రాధాన్యత



**దమ్మపేట రూరల్ 29 ప్రభాతవార్త :**

మెరుగైన విద్యుత్ సరఫరాకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నట్టు సిఎండి కర్నాటి వరుణ్ రెడ్డి తెలిపారు. సోమవారం దమ్మపేట మండలం గండుగుపల్లి ప్రాంతంలో ప్రతిపాదిత 132 కేవీ సబ్‌స్టేషన్, లిఫ్ట్ ఇరిగేషన్ పంపింగ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరా ఏర్పాట్లను సిఎండీ నేరుగా పర్యవేక్షించారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసి రైతులకు నిరంతర విద్యుత్ అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం అంకంపాలెం సబ్‌స్టేషన్‌ను పరిశీలించిన సీఎండీ, 33 కేవీ ఇంటర్‌లింకింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పాత విద్యుత్ లైన్లను దశలవారీగా మార్చడంతో పాటు, ఎమర్జెన్సీ రిస్టోరేషన్ టీం ద్వారా అత్యవసర నిర్వహణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. పామాయిల్ చెట్లు తదితర ప్రాంతాల్లో విద్యుత్ ప్రమాదాల నివారణ కోసం కవర్డ్ కండక్టర్లను ఏర్పాటు చేయాలని, విద్యుత్ సరఫరా భద్రతకు అత్యున్నత ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులకు సూచించారు. వినియోగదారులకు నాణ్యమైన, అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించేందుకు అన్ని చర్యలు చేపట్టాలని తెలిపారు.

## పురుగుమందు తాగి వ్యక్తి మృతి

**దమ్మపేట రూరల్ జూన్ 29 ప్రభాతవార్త**

మొద్దులగూడెం గ్రామానికి చెందిన కోటకేశ్వరరావు (50) పురుగులు మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై రాజేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మొద్దులగూడెం గ్రామానికి చెందిన కేశవరావు గ్రామ పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఇతను గత రెండు సంవత్సరాల నుంచి తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్నాడని, కొన్ని రోజులు చికిత్స చేయించిన ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో మనస్థాపం చెంది 28వ తేదీన పురుగుల మందు తాగగా సత్తుపల్లి హాస్పటల్లో జాయిన్ చేశారు. చికిత్స పొందుతూ వ్యక్తి మరణించాడని అతని కొడుకు కోట మురళి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

## ఇసుక లారీ పట్టివేత

**దమ్మపేట రూరల్ జూన్ 29 ప్రభాతవార్త**




:తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి అక్రమంగా తెలంగాణ ప్రాంతంలోకి ప్రవేశించిన ఇసుక లారీని పట్టుకొని దమ్మపేట పోలీసులు కేసు నమోదు చేశారు. అల్లిపల్లి గ్రామానికి చెందిన రాజేష్, తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం రంగరాయ కాలనీ చెందిన షేక్ నాగ, షేక్ ఇస్మాయిల్ ను అదుపులోకి తీసుకున్నట్టు ఎస్సై రాజేష్ కుమార్ తెలిపారు.

# రైతుల ఖాతాల్లోకి నేరుగా రైతు భరోసా

**రైతు వేదికల్లో జరిగే వీడియో కాన్ఫరెన్స్ కు రైతులంతా హాజరు కావాలి**

**భారీ వర్షాల వల్లనే సీఎం సభ రద్దు**

**సీఎం సభ ఎప్పుడు నిర్వహించిన విజయవంతం చేస్తాం**

**కామేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్**

కామేపల్లి, జూన్ 29 ప్రభాతవార్త:



తెలంగాణ రాష్ట్రం లోని ప్రజా పాలన ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి సారథ్యంలో రైతుల ఖాతాల్లోకి రైతు భరోసాను మంగళవారం నేరుగా జమ చేస్తుందని మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ తెలిపారు.కామేపల్లి మండ లం కొత్త లింగాల ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో సోమవారం నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ మండల స్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో వారు పాల్గొని ప్రసంగించారు.భారీ వర్షాల నేపథ్యంలో ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురంలో మంగళవారం నిర్వహించాల్సిన ముఖ్యమంత్రి రైతు ఆశీ ర్వాద సభను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసిందని తెలిపారు.వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందని అన్నారు.అయితే రైతులకు ప్రకటించిన కార్యక్రమం లో ఎలాంటి మార్పు లేకుండా, రైతు భరో సా నిధుల విడుదలను హైదరాబాద్ లో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.ఈ మేరకు హైదరాబాద్ శిల్పకళా వేదికలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి, అక్కడి నుంచే ముఖ్యమంత్రి రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారని తెలి పారు.భారీ వర్షాలు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని మధిర సభను వాయిదా వేసిన ప్రభుత్వం, రైతులకు నిధుల పంపిణీ ప్రక్రియ మాత్రం యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు.దీంతో రాష్ట్ర వ్యాప్తంగా అర్హులైన రైతుల ఖాతాల్లో రైతుభరోసా సాయం జమ కానున్నదని వి వరించారు.ముఖ్యమంత్రి సభ ఎప్పుడు నిర్వహించిన కామేపల్లి మండలం నుంచి అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు.మంగళవారం సాయంత్రం నాలుగు గంటల నుండి రైతు వేదికలలో జరిగే వీడియో కాన్ఫరెన్స్ లో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జి ల్లా సెక్రెటరీ ఎస్ కె పతే మహమ్మద్, జిల్లా నాయకులు తోటకూరి శివయ్య,మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుగులోత్ గబ్రు నాయక్,కొత్త లింగాల సర్పంచ్ ఇట్టా శ్రీను,కొమ్మినేపల్లి సర్పంచ్ బి.అనురాధ,ఉపసర్పంచ్ మేకల మల్లికార్జునరావు, రేగాళ్ల శ్రీరాములు,బిసి సెల్ మండల అధ్యక్షుడు చల్ల మల్లయ్య,ఎడ్లపల్లి బాబు,అజ్మీర రాందా స్,కమటం వెంకటేశ్వర్లు,పుచ్చకాయల అ ప్పారావు,పండగ కోటి,కాట్రాల వీరబాబు, శీలం పుల్లయ్య,మాలోత్ ప్రేమ్ కుమార్, పాటిబండ్ల ప్రసాద్,బాలు,రాయల భాస్క ర్,పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు,ప్రజా ప్రతి నిధులు,పార్టీ పెద్దలు,కార్యకర్తలు తదిత రులు పాల్గొన్నారు.




## కామేపల్లి మండలం లో ఇంటింటా పల్స్ పోలియో

**పర్యవేక్షించిన డాక్టర్ శ్రీదేవి, మొబైల్ టీం 8,525 గృహాలను సందర్శించిన వైద్య సిబ్బంది**

కామేపల్లి, జూన్ 29 ప్రభాతవార్త:



కామేపల్లి మండల వ్యాప్తంగా సోమవారం ఇంటింటా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించారు.తొలిరోజు 05 ఏళ్లలోపు పిల్లలకు 96 శాతం పోలియో చుక్కలు వే శారు.మిగిలిపోయిన నాలుగు శాతం మంది పిల్లలకు కూడా పోలియో చుక్కలు వే సేందుకు ఇంటింటిని సందర్శించారు.మండల పరిధిలోని 24 గ్రామ పంచాయ తీలో 11043 గృహాలు ఉండగా వాటిలోడాక్టర్ శ్రీదేవి, మొబైల్ టీం సారథ్యంలో పల్స్ పోలియో సిబ్బంది 8,525 గృహాలను సందర్శించారు.77 శాతం గృహ



సందర్శన ప్రక్రియ పూర్తయిందని, నూరు శాతం పిల్లలకు పోలియో చుక్కలు వేసి పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయటమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు డాక్టర్ శ్రీదేవి ఈ సందర్భంగా వివరించారు.చివరి రోజైన బుధవారం కూడా పల్స్ పోలియో సిబ్బంది మిగిలిపోయిన పిల్లల కొరకు గృహ సందర్శన కార్యక్రమా న్ని నిర్వహించడం జరుగుతుందని వెల్ల డించారు.మండల పరిధిలోని జోగ్గూడెం, సాతానిగూడెం, చుక్కి తండా, మున్సిఫ్ బంజర, జగన్నాథ్ తండా, మద్దులపల్లి గ్రామాల్లో మొబైల్ టీమ్ తో కలిసి ఇం టింటా పల్స్ పోలియో కార్యక్రమాన్ని పర్య వేక్షించినట్టు తెలిపారు.ఈ కార్యక్రమంలో హెచ్ ఇ ఓ కే.వెంకటేశ్వర్లు, పిహెచ్ఎన్ మార్తాబాయ్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గుర్తు తెలియని వ్యక్తి మృతి మార్చురీలో మృతదేహం

మధిర జూన్ 29 ప్రభాతవార్త



అకస్మారక స్థితిలో ఉన్న గుర్తు తెలియని వ్యక్తిని స్థానికుల సమాచారంతో ఆసుపత్రికి తరలించగా అతను మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రికి జరిగింది. వివరాల మేరకుఆదివారం సాయంత్రం పట్టణంలోని రిలయన్స్ మార్ట్ దగ్గరలో అపస్మారక స్థితిలో సుమారు 50 ఏళ్ల వయసు కలిగిన వ్యక్తి పడి ఉండగా, 108 కు వచ్చిన సమాచారంపై ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొని వెళ్లగా చికిత్స పొందుతూ సదరు వ్యక్తి మృతి చెందినట్లు పట్టణ పోలీసులు తెలిపారు. ఇతని వద్ద ఎటువంటి గుర్తింపు సమాచారము ఆధారము లభించలేదని ఎస్సై నవిత తెలిపారు. మరణించిన వ్యక్తి మృతదేహమును మధిర ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీ గది నందు భద్రపరచడం జరిగిందని, పై వ్యక్తి ఆచూకీ తెలిసినవారు టౌన్ ఎస్ హెచ్ ఓ : 8712659159మధిర టౌన్ పోలీస్ స్టేషన్ : 8712659160 నాకు సమాచారం అందించాలని ఆమె కోరారు.

## విద్యుత్ఘాతంతో లారీ డ్రైవర్ మృతి

సత్తుపల్లి జూన్ 29 ప్రభాత వార్త



సత్తుపల్లి మండలం చెరుకుపల్లి గ్రామంలో విద్యుత్ ఘాతంతో లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం గ్రామ సమీపంలోని పనులు చేసుకుని లారీ మీద జెసిబి ని తీసుకొనస్తుండగా చెరుకుపల్లి సమీపంలో రాగానే 11 కేవీ విద్యుత్తు వైర్లు తగిలి విద్యుత్ సరఫరా అవటంతో లారీ డ్రైవర్ విద్యుత్ షాక్ గురై మృతి చెందినట్లు తెలిపారు. మృతుడు అన్నపురెడ్డిపల్లి మండలం పెంట్లం గ్రామానికి చెందిన రెడ్డిపోగు వెంకటేశ్వరావు, ఇతనికి భార్య కుమార్తె కుమారుడు సంతానం కలరు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అర్హులైన ఓటరు జాబితాను సిద్ధం చేయడమే సర్ ముఖ్య ఉద్దేశ్యం

**-సర్పంచ్ బొల్లి జయంతివెంకటకృష్ణ**

బయ్యారం,జూన్29,ప్రభాతవార్త:

అర్హులైన ఓటరు జాబితాను సిద్ధం చేయడమే సర్ కార్యక్రమ ముఖ్య ఉద్దేశ్యమని జగ్గుతండా సర్పంచ్ బొల్లి జయంతివెంకటకృష్ణ అన్నారు. సోమవారం మండలంలోని జగ్గుతండాలో సర్ కార్యక్రమాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని నకిలీ ఓట్లను తీసేసి అర్హులైన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యం అన్నారు. ప్రజలందరు ఓటు సవరణ ఫారాలను జాగ్రత్తగా పూర్తిచేసి బూత్‌లెవల్ అధికారులకు ఇవ్వాలన్నారు. ఎవరికైనా సందేహం ఉంటే బూత్‌లెవల్ అధికారిని సంప్రదించి ఫారంను పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఓటర్లు, గ్రామప్రజలు, బూత్‌లెవల్ అధికారులు పాల్గొన్నారు.

## రైతు అభ్యున్నతియే లక్ష్యంగా సహకార సంఘం కృషి

గార్ల,జూన్29,ప్రభాతవార్త:



రైతు అన్ని రకాల ఆర్థిక అభ్యున్నతియే లక్ష్యంగా సహకార సంఘం పనిచేస్తుందని సహకార పరపతి సంఘం చైర్మన్ వడ్లమూడి దుర్గాప్రసాద్ అన్నారు. జాతీయ సహకార వారోత్సవాల సందర్భంగా కార్యాలయ ఆవరణలో సంఘం డైరెక్టర్లు, సిబ్బంది, రైతులతో కలసి సహకార జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 29నుండి జూలై 6వరకు సహకార వారోత్సవాలను జరుపాలని సూచించారు. సొసైటి ద్వారా వ్యవసాయ పెట్టుబడులకు రుణాలు, సబ్సిడిపై విత్తనాలు, ఎరువులు, టార్పలిన్‌లు అందిస్తూ వరిధాన్యం, మొక్కజొన్న కొనుగోలు మొదలగు సేవలు రైతులకు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు శీలంశెట్టి ప్రవీణ్‌కుమార్, ఆడెపు వెంకటేశ్వర్లు, యార్లగడ్డ వెంకటేశ్వరరావు, నాదెళ్ల శ్రీనివాస్, గంగావత్ సునిత, నాదెళ్ల రామారావు, కమలమ్మ, సీఈవో సింగు వెంకటేశ్వర్లు, సిబ్బంది భీముడు, హన్మంతు, రవి, చంద్రశేఖర్, రమేష్, ప్రతాప్ రైతులు పాల్గొన్నారు.

## రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ కు రైతులు హాజరు కావాలి

**కామేపల్లి ఏవో బి.తారా దేవి**

కామేపల్లి, జూన్ 29 ప్రభాతవార్త:



కామేపల్లి మండల పరిధిలోని కామేపల్లి, పాత లింగాల, కొమ్మినేపల్లి రైతు వేదికలలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహి స్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి బి.తారా దేవి సోమవారం తెలిపారు.దృశ్య శ్రవణ మాధ్యమం ( వీడియో కాన్ఫరె న్స్ ప్రత్యక్ష ప్రసారం రైతు నేస్తం కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శిల్ప కళా వేదిక , హైదరాబాద్ లో జరగనున్న రైతు భరోసా నిధు ల విడుదల కార్యక్రమాన్ని వీక్షించడానికి రైతులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.సీఎం రేవంత్ రెడ్డి రైతులను ఉద్దేశించి ప్రసంగిస్తారని తెలిపారు.

## సింగరేణిలో ప్రారంభమైన రిలే నిరాహార దీక్షలు..

**- కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దీక్షలు..**

సత్తుపల్లి జూన్ 29 ప్రభాతవార్త:

కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ద్వారా సింగరేణిలో అన్ని ఏరియాల్లో సింగరేణి అధికారులు పెండింగ్ లో ఉన్న డిమాండ్స్ సాధనకై నిరసన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుంది. దీనిలో భాగంగా సోమవారం ఉదయం 9.00గంటలకు సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఆఫీస్ వద్ద సింగరేణి అధికారులు నల్ల బ్యాడ్జీలు ధరించి రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు.సింగరేణి అధికారులకు పీఆర్పీ బకాయిల చెల్లింపు, వేతన సవరణతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఎస్, సి,సి, ఎల్, బ్రాంచ్, అధికారులు రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. కోల్ ఇండియాలో అమలు చేసిన విధంగా సింగరేణి అధికారులకు పే అఫ్ గ్రేడేషన్ అమలు చేయాలి అని, పి ఆర్ పి బకాయిలు వెంటనే చెల్లించాలని, కోల్ ఇండియా అధికారులతో సమానంగా అన్ని అలవెన్సులు ఇతర ప్రయోజనాలు కల్పించాలని, సింగరేణికి రావాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలని ప్రధాన డిమాండ్లతో ఈ రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు.



ఈ దీక్షలుజూన్ 29 నుంచి జూలై 13 వరకు జరగనున్నాయి. తొలి రోజు వి వేమా రెడ్డి , ఎస్సీ ( ఎస్ ఎం ఎం సి) రిటైర్డ్, ఏ అవినాష్ డిప్యూటీ మేనేజర్ , కే రాజేష్ డిప్యూటీ మేనేజర్, ఏ ప్రదీప్ కుమార్ , జాయింట్ సెక్రటరీ సిఎంఓఏఐ, డి శ్రీనివాస్ , ట్రెజరర్ సీఎంఓఏఐ నిరహార దీక్షలో కూర్చున్నారు. వీరికి సత్తిపల్లి ఏరియా లోని ప్రాజెక్ట్ ఆఫీసర్స్, ఎస్వీఆర్ ప్రహ్లాద , ఏఎల్ఎస్వి సునీల్ వర్మ , ఎస్ ఓ టు జి ఎం, బొల్లం శ్రీనివాస్ , ఏరియా ఇంజనీర్ కె సోమశేఖర అన్ని ప్రాజెక్టులోని ప్రాజెక్టు ఇంజనీర్లు అన్ని ఓసీ లలోని అధికారులందరూ సంఘీభావం తెలియజేశారు. రానున్న రోజుల్లో సంఘ ప్రతినిధులు,వివిధ విభాగాల అధికారులు దీక్షలను కొనసాగించనున్నట్లు తెలిపారు.





## మంచినీటి సమస్య పరిష్కరించిన సర్పంచ్..

సత్తుపల్లి జూన్ 29 ప్రభాతవార్త:

మండల పరిధిలోని బేతుపల్లి గ్రామంలోని ఎస్టీ కాలనీకి చెందిన వాసులు గత పది రోజులుగా త్రాగునీటికి ఇబ్బంది పడుతూ ఉన్నారు. గ్రామంలో త్రాగునీటి కోసం గత పదేళ్ల క్రితం భూమిలోచేసిన పీవీసీ పైపులు పగిలి అట్టి పైపుల్లోకి పీసులు లాంటి చేరుకొని నీరు ప్రజలకి సరఫరా గాక నిలిచిపోవడం వల్ల కొన్ని రోజుల నుంచి ఎస్టీ కాలనీవాసులు త్రాగినీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ దొడ్డ రాజేంద్రప్రసాద్ (అమ్ములు) యుద్ధ ప్రాతిపదికన సోమవారం దగ్గరుండి కూలీలని పెట్టించి తవ్వించి అట్టి పైపు స్తానే కొత్త పైపులను వేసి త్రాగునీటికి ప్రజలు ఇబ్బంది పడకుండా పునరుద్ధరించారు. ఇన్ని రోజుల నుంచి పంచాయతీ నుండి మంచినీటి ట్యాంకు ద్వారా నీరు సరఫరా చేశారు. ఈ త్రాగినీటి సమస్య విషయంలో సకాలంలో స్పందించి సర్పంచి దొడ్డ



రాజేంద్రప్రసాద్ తిరిగి మంచినీళ్లపునరుద్ధరించినందుకు ఎస్టీ కాలనీవాసులు సర్పంచ్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

## కల్లూరు పట్టణంలో నూతన డిసిసిబి బ్యాంకును ప్రారంభించిన మంత్రి తుమ్మల

**- పాల్గొన్న స్థానిక శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, పసుమర్తి చంద్రరావు**

కల్లూరు, జూన్ 29, ప్రభాతవార్త:



కల్లూరు పట్టణములో నూతన గా ఏర్పాటుచేసిన డి సి సి బి నూతన బ్రాంచ్ ను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఉదయం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల తో పాటు సత్తుపల్లి నియోజకవర్గ శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్, జిల్లా కాంగ్రెస్ నాయకులు, ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పసుమర్తి చందర్రావు తో పాటు సహకార సంఘ జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు, ప్రజలు, తుమ్మల అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## సత్తుపల్లిలో ఆధునిక న్యూరో వైద్య సేవలకు శ్రీకారం...

**- న్యూరో హాస్పిటల్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే..**

సత్తుపల్లి జూన్ 29 ప్రభాతవార్త:



సత్తుపల్లి పట్టణంలో సిద్ధారం రోడ్డు కుఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్వీ సత్తుపల్లి న్యూరో హాస్పిటల్‌ను సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ రాగమయి దయానంద్ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సత్తుపల్లి పట్టణానికి తొలిసారిగా న్యూరో హాస్పటల్లో ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందని దీని వల్ల చుట్టుపక్కల గ్రామాల



ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని ఈ అవకాశాన్ని ప్రజలు ఉపయోగించుకోవాలని ఎమ్మెల్యే కోరారు.ఆసుపత్రిలో ప్రతి రోజూ న్యూరో ఓపీ, న్యూరో ఎమర్జెన్సీ సేవలు, ఎన్‌సీఎస్ (ఎన్సిఎస్), ఈఈజీ (ఈ ఈ జి), అత్యాధునిక ల్యాబ్ సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ హాస్పటల్లోడీఎం న్యూరాలజీ (ఉస్మానియా) అర్హత కలిగిన కన్సల్టెంట్ న్యూరో ఫిజీషియన్ డాక్టర్ బి. కృష్ణ చైతన్య రెడ్డి సేవలు అందించనున్నారణి ఎమ్మెల్యే తెలిపారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్, మహమ్మద్ రెహనా కమల్ పాష , బొంతు సుమలత వేణు, కౌన్సిలర్ తోట సుజలా రాణి,ఆసుపత్రి వ్యవస్థాపకులు డాక్టర్ జి.వి.కె.ఆర్. గౌడ్, మేనేజింగ్ డైరెక్టర్ కసం సంతోష్ , గోవిందు, శ్రీనివాస్, ఎస్. రాజు ,సోమేశ్వరరావు, ఐఎంఏ అధ్యక్షులు సత్యవతి కంటి ఆసుపత్రి వైద్యులు,డాక్టర్ శివాజీ, కిడ్స్ కేర్ హాస్పటల్ వైద్యాధికారి డాక్టర్ఖాసిం, పట్టణంలోని పలు ప్రైవేట్ హాస్పిటల్స్ వైద్యులు హాజరైన వారిలో ఉన్నారు.

## తండ్రికి తలకొరివి పెట్టిన తనయి

పెనుబల్లి, జూన్ 29, ప్రభాతవార్త:

కొడుకు లేని లోటు తీరుస్తూ తండ్రికి తల కొరివి పెట్టి కన్న తండ్రి రుణం తీర్చుకుంది కూతురు. వివరాలిలా వున్నాయి.. పెనుబల్లి మండలం ఉప్పల చిలక గ్రామంలో వేల్పుల సీతయ్య సోమవారం మృతి చెందాడు. మృతుడికి భార్య ఇద్దరు, కుమార్తెలు ఉన్నారు. కుమారులు లేని మృతుడు సీతయ్యకు



పెద్ద కుమారుడు స్థానంలో అతని పెద్ద కుమార్తె మానస అన్ని తానై అంత్య క్రియలు నిర్వహించింది. మృతుడు వేల్పుల సీతయ్య గతంలో రెండు పర్యాయాలు ఉప్పల చిలక గ్రామానికి ఉప సర్పంచ్ గా పనిచేశారు.

## ఘనంగా రాయల నాగేశ్వరరావు పదవీ విరమణ

కల్లూరు, జూన్ 29, ప్రభాతవార్త:



కల్లూరు మండల టీఎస్ యుటిఎఫ్ అధ్యక్షులు రాయల నాగేశ్వరరావు (గవర్నమెంట్ హై స్కూల్ వెన్న వెల్లి నందు స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీష్ ఉపాధ్యాయులు గా) పదవీ విరమణ సందర్భంగా రాయల నాగేశ్వరరావు వారి ధర్మపత్ని శ్రీదేవి లకు టీఎస్ యుటిఎఫ్ కల్లూరు మండలం తరపున అభినందనలు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. కల్లూరు మండలంలో 2018 నుంచి మండల టీఎస్ యుటిఎఫ్ అధ్యక్షులుగా సుదీర్ఘకాలం పనిచేసి, నేడు పదవీ విరమణ చేయుచున్న రాయల నాగేశ్వరరావు కల్లూరు మండలంలో టీఎస్ యుటిఎఫ్ సంఘ బలోపేతానికి అహర్నిశలు కృషిచేసి, మండలంలో పాఠశాలల విద్యాభివృద్ధికి, ఉపాధ్యాయుల శ్రేయస్సుకు దోహదపడే విధంగా అవిశ్రాంతంగా అకుంఠిత దీక్షతో మంచి ఉపాధ్యాయుడుగా, సంఘ నాయకుడుగా, కుటుంబ పెద్దగా అన్ని పాత్రలకు సమన్యాయం చేసిన పరిపూర్ణమైన వ్యక్తిత్వం కలిగిన వ్యక్తిగా పేరుగాంచి, అందరి మన్ననలు పొంది నేడు విశ్రాంత జీవనంలోకి అడుగి డుతూ, రాబోవు రోజుల్లో అష్టైశ్వర్యాలు, ఆయురారోగ్యాలతో సమాజంలో తాను ఎంచుకున్న మార్గంలో, మరిన్ని సేవా కార్యక్రమాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ, అందరికీ అందుబాటులో ఉంటూ వారి శేష జీవితాన్ని గుర్తుండిపోయే విధంగా కొనసాగిస్తారని, కోరుకుంటూ శుభాకాంక్షలు తెలిపారు.

## రైతు వేదికలో రైతుబంధు నిధుల విడుదల ప్రత్యక్ష ప్రసారం

పాల్వంచ టౌన్,జూన్ 29,ప్రభాతవార్త:

పాల్వంచ మండలంలోని పాల్వంచ,పాయకారి యానంబైల్ రెవెన్యూ గ్రామాల పరిధిలోని రైతుల కోసం మంగళవారం (జూన్ 30) సాయంత్రం 4 గంటలకు పుల్లైగూడెం రైతు వేదికలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నట్లు పాల్వంచ వ్యవసాయ విస్తరణ అధికారి తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా రైతుబంధు నిధుల విడుదల కార్యక్రమం నిర్వహించబడుతుండగా, దాని ప్రత్యక్ష వీడియో కాన్ఫరెన్స్ ప్రసారం పుల్లైగూడెం రైతు వేదికలో ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.కార్యక్రమానికి పునుకుల,కోడిపుంజుల వాగు,పుల్లైగూడెం గ్రామాల సర్పంచ్‌లు,వార్డు సభ్యులు, ఎం.పీ.టి.సీలు,జెడ్.పీ.టి.సీలు, పాల్వంచ మండలంలోని కార్పొరేటర్లు, మేయర్,సహకార సంఘాల సభ్యులు, కొత్తగూడెం శాసనసభ్యుడు తదితర ప్రజాప్రతినిధులు హాజరుకానున్నారు.పాల్వంచ,పాయకారి యానంబైల్ రెవెన్యూ గ్రామాల పరిధిలోని రైతులందరూ మంగళవారం సాయంత్రం 4 గంటలకు పుల్లైగూడెం రైతు వేదికకు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులు కోరారు.

# సనాతన ధర్మం పేరుతో మతోన్మాద రాజకీయాలు చేస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్

**నేలకొండపల్లి, జూన్ 29 ప్రభాతవార్త:**

సనాతన ధర్మం, హిందూ ధర్మం అంటూ కేంద్రంలోని బిజెపి, అనుబంధ ఆర్ఎస్ఎస్ చేస్తున్న మతోన్మాద రాజకీయాలను ప్రజాస్వామ్య, లౌకికవాద శక్తులు తిప్పి కొట్టాలని ప్రముఖ లెక్చరర్ బోడపట్ల రవీందర్ వెల్లడించారు. సోమవారం నేలకొండపల్లి లోని ప్రైవేటు ఫంక్షన్ హాల్ లో పోతనబోయిన పెరుమాళ్ళు ప్రాంగణం నందు జరుగుతున్న సిపిఎం పాలేరు డివిజన్ రాజకీయ శిక్షణ తరగతులలో భాగంగా రెండవ రోజు ఉదయం మతోన్మాద రాజకీయాలు ప్రతిఘటన అనే అంశం పై ఆయన పార్టీ శ్రేణులకు తరగతి బోధించారు. ఈ సందర్భంగా బోడపట్ల రవీందర్ మాట్లాడుతూ దేశంలో ప్రాచీన మధ్యయుగపు సనాతన ధర్మాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఆర్ఎస్ఎస్ కుట్ర చేస్తున్నాయని విమర్శించారు. సనాతన ధర్మం పేరుతో ఒకే



దేశం, ఒకే మతం, ఒకే పార్టీ అంటూ దేశంలోని ఇతర మతస్తులపై బిజెపి దాడులకు పూనుకుంటుందన్నారు. ఏ ప్రాంతంలో కూడా సనాతన ధర్మం ఎప్పుడు వేరే మతస్తులను హింసకు గురి చేయమని చెప్పలేదని ఆయన గుర్తు చేశారు. సనాతనం పేరుతో హిందువులను సైతం తప్పుదారి పట్టిస్తున్న బిజెపి, ఆర్ఎస్ఎస్ కుటిల రాజకీయాలపై హిందువులు తిరుగుబాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం సామ్రాజ్యవాదం ద్రవ్య పెట్టుబడి అనే అంశంపై ప్రముఖ లెక్చరర్ బండారు రమేష్ తరగతి బోధించారు. ఈ శిక్షణ తరగతులకు సిపిఎం పార్టీ జిల్లా నాయకులు గుడవర్తి నాగేశ్వరరావు ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు. ఈ శిక్షణ తరగతులలో సిపిఎం పార్టీ పాలేరు డివిజన్ డివిజన్ కార్యదర్శి బండి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు సంగ్ర ప్రసాద్, షేక్ బషీరుద్దీన్, కొమ్ము శ్రీను, ఊరడి సుదర్శన్ రెడ్డి, మల్లెల సన్మంతరావు, మండల కార్యదర్శులు కె.వి.రెడ్డి, తోటకూరి రాజశేఖర్, వడ్లమూడి నాగేశ్వరరావు, డివిజన్ కమిటీ సభ్యులు తుళ్లూరు నాగేశ్వరరావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, రచ్చ నరసింహారావు, ఏటుకూరి రామారావు, మారుతి కొండలరావు, ఎడ్ల తిరుపతిరావు, దండా సూర్యనారాయణ, బొడ్డు మధు, డేగల వెంకటేశ్వరరావు, అనాసాగరం సర్పంచ్ బొడ్డు రాంబాబు, మందడపు మురళీకృష్ణ, ఇంటూరి అశోక్, సిరికొండ ఉమామహేశ్వరి, భూక్య కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# సర్ పేరుతో ఓట్ల తొలగింపును పార్టీ శ్రేణులు..ప్రజలు ఐక్యంగా అడ్డుకోవాలి

**ఏన్కూరు, జూన్ 29, ప్రభాతవార్త :**

ఓటు హక్కును హరించే బీజేపీ కుట్రలను ప్రజాస్వామ్యవాదులు ఖండించాలని..స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పేరుతో దేశంలో ఓట్ల దొంగ తనం జరుగుతోందని..సర్ పేరుతో జరుగుతున్న ఓట్ల తొలగింపును పార్టీ శ్రేణులు..ప్రజలు ఐక్య ముగా అడ్డుకోవాలి సీపీఐ(యం) రాష్ట్ర సీనియర్ నాయకులు పోన్నం వెంకటేశ్వరరావు పిలుపు నిచ్చారు.సీపీఐ (యం) వైరా డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో మండల పరిధిలోని తిమ్మరావుపేట గ్రామంలోని మోతుకూరి గార్డెన్స్ లో నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతుల్లో మూడోవ రోజు ఉదయం "పార్టీ నిర్మాణం..పని పద్ధతులు"అంశంపై పొ న్నం వెంకటేశ్వరరావు వివరించారు.ఈ సందర్భంగా పొన్నం వెంకటేశ్వరరావు మాట్లాడుతూ..ఇప్పటి వరకు సర్ అ మలు జరిగిన రాష్ట్రాలలో భారీగా ఓట్లను తొలగించారని ఆయన అన్నారు.పశ్చిమ బెంగాల్..తమిళనాడు..రాష్ట్రా లలో లక్షలాది ఓట్లను తొలగించి బీజేపీ కూటమి పార్టీలు లబ్ది పొందాయని ఆయన ఆరోపించారు.బీజేపీ అను బంధ సంస్థగా ఎన్నికల కమిషన్ పనిచేస్తుందని ఆయన అన్నారు.బీజేపీ వ్యతిరేకమైన మైనార్టీ..గిరిజన..దళిత క్రిస్టియన్ ఓట్లను తొలగించేందుకు చేపట్టిన సర్ ప్రక్రియ పట్ల బూతు లెవెల్ ఏజెంట్లు అత్యంత అప్రమత్తంగా వ్య వహరించాలని ఆయన తెలిపారు.అర్హత కలిగిన ఓట్లను కాపాడుకోవడంలో బూతు లెవెల్ ఏజెంట్లే కీలకమని ఆ యన స్పష్టం చేశారు.ఏమ్యూనిషన్ పారాల పంపిణీ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో పార్టీ శ్రేణులు..బూ తుల ఏజెంట్లు ప్రతి ఓటర్ కు ఫారాలు అందేలా కృషి చేయాలని ఆయన కోరారు.సర్ ప్రక్రియలో ఏమాత్రం అలస త్వం వహించవద్దని పార్టీ శ్రేణులకు ఆయన సూచించారు.బీజేపీ సర్కార్ చేపట్టిన కుట్రలపై రాష్ట్ర ప్రభుత్వం స్పం దించాలని..రాష్ట్రంలో అర్హులైన ఓటర్లను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన స్పష్టం చేశారు.



ప్రపంచ యుద్ధాల వల్ల ధరలు పెరిగి..ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మతోన్మాద రాజకీయాలతో ప్రజలను విభజిస్తూ పాలన చేస్తుందని ఆయన విమర్శించారు.రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు.గ్రామ స్థాయిలో పార్టీ కార్యకర్తలు..సంక్షేమ పథకాల అమలును అధ్యయనం చేసి అర్హులందరికీ న్యాయం జరిగే వరకు పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఐక్య ఉద్యమాలే సామాజిక మార్పుకు పునాది.. ప్రజా సమస్యలపై విస్తృతంగా పోరాటాలు చేయ్యాలి.సీపీఐ(యం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం.సమాజంలో అసమానతలు..దోపిడీ.. పేదరికానికి శాశ్వత పరిష్కారం వర్గ పోరాటాల ద్వారానే సాధ్యమవుతుంద ని.. ప్రజల ఐక్య ఉద్యమాలే సామాజిక మార్పుకు పునాది అని సీపీఐ(యం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీర భద్రం అన్నారు. మండల పరిధిలోని తిమ్మరావుపేట గ్రామంలోని మోతుకూరి గార్డెన్స్ లో నిర్వహించిన రాజకీయ శిక్షణా తరగతుల్లో మూడోవ రోజు మధ్యాహ్నం జరిగిన పార్టీ ప్లీనంలో "పార్టీ కర్తవ్యాలు" గురించి సీపీఐ(యం) వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం వివరించారు.ఈ సందర్భంగా భూక్యా వీరభద్రం మాట్లాడుతూ.. కేంద్ర..రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ప్రజలపై భారాలు మోపుతున్నాయని..కార్మికల..కర్షకుల హక్కులను హరి స్తున్నాయని ఆయన విమర్శించారు.ప్రజా సమస్యల పరిష్కారం కోసం వర్గ పోరాటాలను మరింత విస్తరించాల్సి న అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు.దేశంలో ఓటు హక్కును బలహీన పరిచే చర్యలు ప్రజాస్వామ్యానికి ప్ర మాదకరమని.. ప్రతి పౌరుడి ఓటుహక్కును పరిరక్షించడం ప్రజాస్వామ్య వాదులందరి బాధ్యత అని ఆయన అ న్నారు.రాజ్యాంగ విలువలు..ప్రజాస్వామ్య హక్కులు..సామాజిక న్యాయ పరిరక్షణ కోసం ప్రజలను సమీకరించి ఉ ద్యమాలను మరింత బలోపేతం చేయాలని..ఓటరు జాబితాల సర్వేలో పార్టీ కార్యకర్తలు చురుకుగా పాల్గొని ఓటు హక్కును పరిరక్షించాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ రాజకీయ శిక్షణా తరగతులకు పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దుగ్గి కృష్ణ ప్రిన్సిపాల్ గా వ్యవహరించారు.ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదినేని రమేశ్,జి ల్లా కమిటీ సభ్యులు తాళ్లపల్లి కృష్ణ,సుంకర స ం ద.ా క ర ం . . కొ ం డ బో ం య న నాగేశ్వరరావు,ఏన్కూరు,కొణిజర్ల,సింగరేణి, కామేపల్లి మండలాల కార్యదర్శులు దొంతబోయిన నా గే శ్వ ర రా వు , చె ర ు క ు వ ు ల్లి కుటుంబరావు,కుందనపల్లి నరేంద ర్,అంబటి శ్రీనివాసరెడ్డి,పార్టీ నాయకులు ఏల్పుల రాములు,ఇటికల లెనిన్,కాలసాని సాయి, రేగళ్ల తిరుమలరావు, షేక్ జానీ,కాత్రేల బిక్షం,భూక్యా లచ్చు,డివిజన్ కమిటీ సభ్యులు,మండల కమిటీ సభ్యులు,శాఖ కార్యదర్శులు తది తరులు పాల్గొన్నారు.

## మల్లమ్మకు మల్లి బాబు నివాళులు

**కారేపల్లి,జూన్ 29 ప్రభాతవార్త**

జిల్లా డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్ పల్లపాటి మల్లమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు గిద్దె వారి గూడెం గ్రామానికి చెందిన మల్లమ్మ దశదినకర్మల్లో మల్లి బాబు యాదవ్ ఆమె చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించి,తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మల్లిబాబు వెంటసిత్తారి సింహాద్రి యాదవ్,నాగేశ్వరావు, విసాల వెంకటేశ్వర్లు డేగల ఉపేందర్,డేగల వెంకన్న,గోసి నారాయణ, టి.రామారావు,గోసి వెంకటకృష్ణ,నిమ్మల కృష్ణయ్య,నిమ్మల ఉపేందర్,కడారి వెంకట్ ఉన్నారు.

## ఈరికి నివాళులు

**కారేపల్లి: జూన్ 29 ప్రభాత వార్త**

భిక్య తండా గ్రామానికి చెందిన అజ్మీర వీరన్న తల్లి ఈరి అనారోగ్యంతో మరణించడంతో సోమవారం మాజీ ఎమ్మెల్యే లావుడియా రాములు నాయక్ మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి లు వారి పార్థివదేహానికి పూల మాల వేసి నివాళులార్పించారు కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈకార్యక్రమంలో ముత్యాల సత్యనారాయణ, మాలోత్ శకుంతల, రావూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరేందర్ మంగీలాల్, వాంకు డోత్ నరేష్, భూక్య రాంకిషోర్, ప్రసాద్, కోటి, హారు, కరణ్ సింగ్, వాంకుడోత్ విజయ్, జూపల్లి రాము, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.




## ఎస్సై గా బాధ్యతలు స్వీకరించిన పి.శ్రీనివాసరెడ్డి

**నేలకొండపల్లి, జూన్ 29 ప్రభాతవార్త:**



నేలకొండపల్లి ఎస్సై గా పి.శ్రీనివాసరెడ్డి సోమవారం ఇక్కడి పోలీస్ స్టేషన్ నందు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడి పోలీస్ స్టేషన్ నందు ఎస్సైగా పని చేసిన పి.సంతోష్ ఖమ్మంకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బోడు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న పి.శ్రీనివాసరెడ్డి ని నేలకొండపల్లి కి బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఇక్కడి పోలీస్ స్టేషన్ నందు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్సై పి. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు.

## రైతు సంక్షేమం, అభివృద్దే లక్ష్యం

**నేలకొండపల్లి, జూన్ 29 ప్రభాతవార్త :**



రైతు సంక్షేమం, అభివృద్దే ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం పాలకవర్గం లక్ష్యయమని నేలకొండపల్లి పిఏసిఎస్ చైర్మన్ చైర్మన్ తీగ రమణయ్య వెల్లడించారు. సోమవారం నేలకొండపల్లి మండలం లోని వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలలో సహకార వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. రైతులతో ప్రతిజ్ఞ చేయించారు. నేలకొండపల్లి పీఏసీఎస్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చైర్మన్ రమణయ్య, నాచేపల్లి పిఏసిఎస్ సంఘం నందు చైర్మన్ తన్నీరు సత్యనారాయణ, చెన్నారం పిఏసిఎస్ సంఘం నందు వందనం నాగేశ్వరావు, పైనంపల్లి పిఏసిఎస్ సంఘం నందు చైర్మన్ డాక్టర్ నాగుబండి శ్రీనివాసరావు, బోదులబం డపిఏసిఎస్ సంఘం నందు చైర్మన్ అనంత కాశయ్య సహకార పతాకాలను ఎగురవేశారు. ఈ కార్యక్రమాలలో ఆయా సంఘాల పాలకవర్గ సభ్యులు, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలను ప్రజలల్లోకి తీసుకెళ్లాలి



**నేలకొండపల్లి, జూన్ 29 ప్రభాతవార్త:**

రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజలల్లోకి తీసుకెళ్లాలని కోనాయిగూడెం గ్రామ కాంగ్రెస్ కమిటి అధ్యక్షుడు పాకనాటి కన్నారెడ్డి వెల్లడించారు. సోమవారం కోనాయిగూడెం గ్రామ కాంగ్రెస్ కమిటి సమావేశంను ఆ పార్టీ సీనియర్ నాయకులు మేకల ఆర్జున్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కన్నా రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత అన్ని వర్గాల ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందుతున్నాయన్నారు. పేదోడి సొంతింటి కల ను నేరవేర్చిన ఘనత మంత్రి శ్రీనివాసరెడ్డి కి దక్కుతుందన్నారు. ప్రభుత్వ పథకాలు ప్రతీ ఇంటికి అందుతున్నాయన్నారు. గత పదేళ్లలో ఒక్క ఇంటి నిర్మాణం కూడ జరగలేదన్నారు. కానీ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మొదటి విడత 24 ఇళ్ల ను మంజూరు చేసిన మంత్రి శ్రీనివాసరెడ్డి కి రుణపడి ఉంటామన్నారు. ఇంకా వరసగా నాలుగు విడతలు గా ఇందిరమ్మ ఇళ్ల ను మంజూరు చేస్తారని పేర్కొన్నారు. దీంతో గ్రామంలో గుడిసె లేని గ్రామంగా కాంగ్రెస్ పార్టీ చేస్తుందన్నారు. ఈ సమావేశంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి రాజేష్, నాయకులు వడ్లమూడి నర్సయ్య, కొమ్మినేని విజయ్ బాబు, ఆనం వెంకటరెడ్డి, వుల్లోజి వీరబాబు, కొత్తపల్లి నవీన్, కస్తాల నాగరాజు, గద్దల దాసు,వుల్లోజి శ్రీను పాల్గొన్నారు.

# “సర్” ఫారాల పంపిణి గడువులోపు పూర్తి చేయాలి...

**- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుధర్శన్ రెడ్డి**

**కొత్తగూడెం, జూన్ 29 ప్రభాతవార్త:**






ఓటరు జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం–2026లో భాగంగా ఓటరు వివరాల సేకరణ (ఎన్యూమరేషన్) ఫారాల పంపిణీని నిర్ణీత గడువులోపు పూర్తి చేసి, ప్రతి అర్హత కలిగిన ఓటరికి ఫారం అందేలా చర్యలు చేపట్టాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుధర్శన్ రెడ్డి జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాద్ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమం అమలుపై సమీక్ష నిర్వహించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అంకిత్ అధికారులతో మాట్లాడుతూ... రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాలను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటరు వివరాల సేకరణ (ఎన్యూమరేషన్) ఫారాలను పంపిణీ చేయడంతో పాటు, నిర్ణీత గడువులోపు వాటిని తిరిగి సేకరించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫారాల పంపిణీ, స్వీకరణ ప్రక్రియపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, అర్హత కలిగిన ప్రతి ఓటరు వివరాలు నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ కార్యక్రమాన్ని నిబంధనలకు అనుగుణంగా, ఎలాంటి లోపాలకు తావులేకుండా విజయవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు ఎన్నికల శాఖ సూపర్డెంట్ రంగ ప్రసాద్, ఎన్నికల మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ, ఎన్నికల శాఖ సిబ్బంది నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సేవలు చిరస్మరణీయం: జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, జూన్ 29 ప్రభాతవార్త:**



ప్రజలకు సుదీర్ఘకాలం పాటు అంకితభావంతో, నిబద్ధతతో సేవలందించిన ప్రభుత్వ ఉద్యోగుల సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ అంకిత్ అన్నారు. సోమవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో పదవీ విరమణ పొందుతున్న కె. సంజీవరావు (సీపీఓ), డాక్టర్ వెంకటేశ్వర్లు (డీవీఏహెచ్ఓ), చి. రమేష్‌బాబు (అసిస్టెంట్ ఇంజనీర్, హౌసింగ్), అంజనేయులు (ఆఫీస్ సబార్డినేట్, హౌసింగ్ శాఖ)లకు ఏర్పాటు చేసిన పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌తో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ... పదవీ విరమణ అనేది ప్రతి ఉద్యోగి జీవితంలో ఒక ముఖ్యమైన మైలురాయి అని పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగం పొందిన నాటి నుంచి ఉద్యోగికి సమాజంలో ఒక ప్రత్యేక గుర్తింపు లభిస్తుందని, విధి నిర్వహణలో సంపాదించిన అనుభవం, ప్రజల ఆదరణ జీవితాంతం వెంట ఉంటాయని అన్నారు. 30 నుంచి 40 సంవత్సరాల పాటు ప్రభుత్వ సేవలో ప్రజల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేయడం గొప్ప విషయమని, ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రతి ఉద్యోగి తనవంతు కృషి చేయడం అభినందనీయమని చెప్పారు. ఈ సందర్భంగా పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ ఉద్యోగ జీవితంలోని అనుభవాలను పంచుకుంటూ, తమకు సహకరించిన జిల్లా యంత్రాంగం, సహోద్యోగులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ సర్వేలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు



**దుమ్ముగూడెం ప్రభాతవార్త:** ఏఐసీసీ, టీపీసీసీ,డీసీసీ, నియోజకవర్గ ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మండల కాంగ్రెస్ పార్టీ ఆదేశాలు మేరకు ఎస్ ఐ ఆర్ ఓటర్ సర్వేలో దుమ్ముగూడెం మండల పరిధిలోని సీతారాంపురం గ్రామంలో 125 వ బూత్ ఇంచార్జ్ బీఎల్ఏ మోతుకూరి శ్రీకాంత్ కొత్త దంతెనం పంచాయితీ సర్పంచ్ పొడియం సుబ్బారావు పాల్గొని సర్వేను పరిశీలించారు. బి ఎల్ ఓ తో కలిసి ప్రజలకు ఎన్యుమరేషన్ ఫారాలను అందించారు బి ఎల్ ఓ పొడియం రాధ గిరి ధావర్ కల్లూరి వెంకటేశ్వర్లు తో కలిసి కొత్త దంతెనం గ్రామములో ఓటర్ సర్వే లో పాల్గొన్నారు

# బీఆర్ఎస్ పాలనలో దోపిడికి గురైన తెలంగాణ

- వేలకోట్లు దోచుకుని ప్రజలపై లక్షల కోట్ల  అప్పుల భారం
- సంక్షేమం అభివృద్ధి సమాంతరంగా ప్రజా ప్రభుత్వ పాలన
- మాధవ సేవ మానవ సేవే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యం
- జాబ్ క్యాలెండర్ తో ఉద్యోగులకు ఉద్యోగ అవకాశాలు
- రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో నెంబర్ వన్ గా నిలబెడతాం
- విలేకరుల సమావేశంలోఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**ఎర్రుపాలెం (మధిర) జూన్ 29 ప్రభాతవార్త :**

బీఆర్ఎస్ పాలకులు పదేళ్ల పాలనలో ఆర్థిక, సామాజిక దోపిడీకి పాల్పడి రాష్ట్రాన్ని విధ్వంసం చేశారని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని జమలాపురం శ్రీ కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించిన ఆయన అనంతరం విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల కాలంలో నాటి బిఆర్ఎస్ నాయకులు పాలన ను తమ కుటుంబంలోని నలుగురి కోసం అన్నట్లుగా చేశారని విమర్శించారు, గత పాలకులు రాష్ట్రంలో ఎవరినీ స్వేచ్ఛగా బతకనివ్వలేదని, ప్రతి ఒక్కరి టెలిఫోన్లను ట్యాప్ చేశారని భట్టి విక్రమార్క ఆరోపించారు. అధికారులను రాజకీయ నాయకులను మీడియాను చివరికి భార్య భర్తల ఫోన్లను కూడా ట్యాప్ చేసి వినే రాక్షస కోణాన్ని గత ప్రభుత్వం ప్రదర్శించిందని అన్నారు. దోచుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రజల సొమ్ముతో నాలుగు చానళ్ల పత్రికలు ఏర్పాటు చేసుకుని ప్రత్యేక సోషల్ మీడియా ఇవ్వగానే నడిపిస్తూ అబద్దాలు పోగేసి ప్రజా ప్రభుత్వం పై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం మాధవ సేవ మానవ సేవ అనే మన సంస్కృతి విలువలతో అభివృద్ధి సంక్షేమం అంశాలపై సమాంతరంగా దృష్టిసరించి ముందుకు సాగుతోందని అన్నారు. రాజ్యాంగం ప్రకారం ప్రజాస్వామ్యంలో ప్రజల అవసరాలు తీర్చడం ద్వారానే ప్రజాస్వామ్యాన్ని పూర్తిగా నిలబెట్టగలమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ఇందిరమ్మ ప్రజా ప్రభుత్వం ఇదే లక్ష్యంతో ముందుకు వెళ్తోందని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం నిరుపేదల, మధ్యతరగతి కుటుంబాల అవసరాలను గుర్తిస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని భట్టి విక్రమార్క వివరించారు. రాష్ట్రంలో ఇల్లు లేని నిరుపేద ఉండకూడదనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి నాలుగు పాయింట్ ఐదు లక్షల ఇందిరమ్మ ఇండ్లను తమ ప్రభుత్వం మంజూరు చేసిందని ఆయన గుర్తు చేశారు. ఇందుకోసం రూ.22,500 కోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని ప్రజా ప్రభుత్వం చేపట్టిందని అన్నారు. రాష్ట్రంలోని 1.06 కోట్ల కుటుంబాలకు ఉచితంగా సన్న బియ్యాన్ని అందిస్తున్నట్లు ఆయన తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 53 లక్షల కుటుంబాలు ఈఉచిత విద్యుత్ పథకం ద్వారా లబ్ధి పొందుతున్నాయని ఆయన చెప్పారు. రాష్ట్రంలోని కొన్ని గ్రామాల్లో గ్రామాల్లో 90 శాతం కుటుంబాల కరెంట్ బిల్లు ప్రభుత్వమే ప్రతి నెల బిల్లులు చెల్లిస్తోందన్నారు. రాష్ట్రంలోని 30 లక్షల పంప్ సెట్లకు ఉచిత కరెంట్ అందిస్తున్నామని అన్నారు. దీనికోసం సంవత్సరానికి రూ. 14వేల కోట్లను ప్రభుత్వం డిస్కమ్‌లకు చెల్లిస్తోందన్నారు. రాష్ట్ర మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే ఉద్దేశంతో ఆర్టీసీ బస్సుల్లో మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని, ఇప్పటివరకు దాదాపు రూ10,600 కోట్ల రూపాయలను ఈ పథకం కింద ఆర్టీసీకి ఆర్థిక శాఖ చెల్లించడం జరిగిందన్నారు. మహిళా సంఘాలకు బ్యాంక్ లింకేజ్ ద్వారా రూ. 20,000 కోట్ల రుణాలు అందిస్తూ, 5 సంవత్సరాలలో లక్ష కోట్లకు పైగా వడ్డీ లేని రుణాలను ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. గతంలో ఉన్న రూ. 5 లక్షల సీలింగ్‌ను రూ. 10 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. గత ప్రభుత్వ కాలంలో ఆరోగ్యశ్రీ అస్తవ్యస్తంగా మారి పేదలు ఆస్తులు అమ్ముకునే పరిస్థితి వచ్చిందని, దానిని మారుస్తూ ప్రస్తుత ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిమితిని రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షల వరకు పెంచిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో చదివే విద్యార్థుల కోసం ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు. డైట్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచడం జరిగిందని తెలిపారు. అత్యంత మానవీయ కోణంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే 20 లక్షల మంది విద్యార్థులకు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని 7 లక్షల మంది విద్యార్థులకు, మొత్తంగా 27 లక్షల మంది విద్యార్థులకు ఉదయపు ఉచిత అల్పాహార (బ్రేక్‌ఫాస్ట్) పథకాన్ని ప్రారంభించామని చెప్పారు. వారంలో ఆరు రోజులు అల్పాహారంతో పాటు ఒకరోజు పాలు, ఒకరోజు రాగిజావ అందిస్తున్నామని అన్నారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క గ్రూప్1 పరీక్ష కూడా నిర్వహించకుండా నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుందని భట్టి విక్రమార్క మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే టీఎస్‌పీఎస్సీని ప్రక్షాళన చేసిందని తెలిపారు. జాబ్ క్యాలెండర్ విడుదల చేయడమే కాకుండా, దాదాపు 76,000 మంది నిరుద్యోగులకు నియామక పత్రాలు అందించామని ఆయన గుర్తుచేశారు. దేవాలయాల అభివృద్ధికి సంస్కృతి పరిరక్షణకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన చెప్పారు. రాష్ట్రంలోని ఆలయాల అభివృద్ధి కోసం ..2,216 కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించి, అభివృద్ధి పనులను చేపట్టిందన్నారు. గిరిజనుల ఆరాధ్య దైవమైన సమ్మక్కసారలమ్మ లాంటి దేవాలయాలను వందల కోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తూ, ప్రజల మనోభావాలను కాపాడుకుంటూ ముందుకు వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధిని సమాంతరంగా పరుగులు పెట్టిస్తున్నామని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆర్అండ్‌బీ శాఖ ద్వారా రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా 90,000 కోట్ల రూపాయలతో రహదారుల పనులను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. నిన్ననే నల్గొండలో రూ. 13,000 కోట్లతో హ్యామ్ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. మూసీ పునరుజ్జీవనం, రీజినల్ రింగ్ రోడ్, రేడియల్ రోడ్ల కనెక్టివిటీతో పాటు అనేక పారిశ్రామిక క్లస్టర్లను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్‌లకు దీటుగా ప్రపంచంతో పోటీపడేలా ఒక ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామన్నారు. కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (సర్వీస్ సెక్టార్), పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ (పరిశ్రమలు), రూరల్ రీజియన్ ఎకానమీ (వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు)గా విభజించి రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్ స్థానంలో నిలబెట్టేందుకు కృషి చేస్తున్నట్లు డిప్యూటీ సీఎం చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ఈ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందనిఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

**- స్వామివారికి ప్రత్యేక పూజలు..**

సోమవారం ఉపముఖ్యమంత్రి సతీసమేతంగా ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ధ్వజస్తంభ ప్రాణప్రతిష్ట మహా కుంభాభిషేక ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు. ఆలయానికి వచ్చిన ఉప ముఖ్యమంత్రి దంపతులకు వేద పండితులు, అర్చకులు అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆయన వెంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్ రెడ్డి, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, డిసిసి వైస్ ప్రెసిడెంట్ వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఐలూరి వెంకటేశ్వర రెడ్డి మధిర మార్కెట్ కమిటీ చైర్మన్ బండారు నరసింహారావు ఇతర సీనియర్ నాయకులు పాల్గొన్నారు.